

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సీఎం సారూ..

- అన్నమయ్య ప్రాజెక్టుకు మోక్షమెప్పుడో? ● శ్రీనివాసపురం రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం ఎన్నటికో?
- హంద్రీ-నీవా పనులు పూర్తి ఎప్పుడు? ● 17 నెలల్లో జిల్లాకు మూడుసార్లు రాక




ఇవి గుర్తున్నాయా?

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేడు జిల్లా పర్యటనకు వస్తున్నారు. చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో లబ్ధిదారుల గృహప్రవేశాలు, పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొంటారు. ప్రజావేదిక కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 17 నెలల్లో ఇప్పటికి రెండుసార్లు జిల్లాకు రాగా నేడు మూడోసారి వస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలోనూ.. ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంకా పరిష్కారం కాని చంద్రబాబు ఇచ్చిన హామీలు, సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

టమోటా పల్ప్ పరిశ్రమ ఏర్పాటు ఎప్పుడు ?

మదనపల్లె, పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో రైతులు ఎక్కువగా టమోటా పంటను పండిస్తున్నారు. అయితే ధరలు స్థిరంగా లేకపోవడంతో రైతులు పూర్తి స్థాయిలో నష్టపోతున్నారు. మార్కెట్‌కు తీసుకెళ్లిన పంటను ఎక్కువ రోజులు నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో రైతులు టమోటాలను వచ్చిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఉంది. అయితే టమోటా పంట అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. గతంలో చంద్రబాబు ఇక్కడ టమోటా పల్ప్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇవే కాకుండా.. ఇంకా జిల్లాలో పలు ముఖ్య సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి.

2024 ఎన్నికల సందర్భంగా ప్రచారంలో మదనపల్లెను జిల్లా చేస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రకటిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. మదనపల్లెలో ముస్లిం మైనార్టీలకు షాదీమహాల్ అసంపూర్తిగా ఉంది. రాష్ట్రంలో ధర్మవరం తర్వాత చేనేతలు ఎక్కువగా ఉండే వందన పల్లెకు గుర్తింపు తెస్తామని, ఇక్కడ తయారయ్యే పట్టుచీరలకు బ్రాండ్ ఇమేజ్‌తో పాటు టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. కార్మికులందరికీ శిక్షణ ఇచ్చి మార్కెట్‌లో పోటీకి అనుగుణంగా డిజైన్లు తయారు చేసేలా తయారు చేస్తామని హామీ ఇచ్చారు. రాయచోటి నియోజకవర్గం పరిధిలో ఉన్న ఝరికోన ప్రాజెక్టు కాలువలు పదేళ్లుగా అడుగు ముందుకు పడడం లేదు. నిధులు కేటాయించి.. పనులు జరిపించాలి. రాయచోటి పట్టణంలో వైసీపీ ప్రభుత్వంలో మొదలైన భూగర్భ డ్రైనేజి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మూడు వందల కోట్ల రూపాయల అంచనాతో మొదలైన ఈ పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. జిల్లాలో ఇంకా పలు ప్రధాన సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. వీటిపైన ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు

అన్నమయ్య ప్రాజెక్టుకు మోక్షమెప్పుడో?

రాజంపేట మండల పరిధిలోని అన్నమయ్య ప్రాజెక్టు వరద నీటికి కొట్టుకుపోయి.. ఇప్పటికి నాలుగు సంవత్సరాలు అవుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో చెయ్యేరు నదిలో వైసీపీ ముఖ్యనాయకుల ఇసుక దోపిడీ కారణంగా ఈ ప్రాజెక్టు కొట్టుకుపోయింది. తన హయాంలో జగన్‌రెడ్డి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పైసా ఖర్చు పెట్టలేదు. తాము అధికారంలోకి వస్తే త్వరగా ఈ ప్రాజెక్టును నిర్మిస్తామని రాజంపేట ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 17 నెలలు గడుస్తోంది. త్వరగా ఈ ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.




పీలేరులో పిచ్చి మొక్కలతో పూడిపోయిన హంద్రీ-నీవా కాలువ

హంద్రీ-నీవా పనులు పూర్తయ్యేనా?


పీలేరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న హంద్రీ-నీవా పథకాన్ని పూర్తి చేస్తామని 2024లో ఎన్నికల ప్రచారానికి వచ్చినపుడు చంద్రబాబు హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న హంద్రీ-నీవా పథకాన్ని పూర్తి చేయడమే కాకుండా అడవిపల్లె రిజర్వాయర్‌ను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. పీలేరు నియోజకవర్గంలో హంద్రీ-నీవా కాలువలు పిచ్చి మొక్కలతో నిండిపోవడమే కాకుండా చాలాచోట్ల పూడిపోయాయి. దీంతో ఆయకట్టుకు నీళ్ల అందడం లేదు. అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు అడవిపల్లె గురించి పట్టించుకోలేదు. ఈ పనుల గురించి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పలుమార్లు అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారు.

చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ గుర్తుందా?

మదనపల్లె పట్టణ తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చిప్పిలి, గుట్టకిందపల్లె సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు పూర్తి చేస్తామన్నారు. అప్పట్లో మేమే ట్యాంకులను నిర్మించాము. ఎన్నికల అనంతరం మొరవలను కూడా పూర్తి చేసి పట్టణ ప్రజలకు తాగునీటిని అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు చెప్పారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ దీని గురించే పట్టించుకోలేదు. ఫలితంగా పైప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు బాహుదాలో వృథాగా పోతోంది.



అసంపూర్తిగా చిప్పిలి సమ్మర్ స్టోరేజీ పనులు



శ్రీనివాసపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం ఎప్పటికో?

హంద్రీ-నీవా సుజల స్రవంతి పనుల్లో భాగంగా చిన్నమండెం మండలం శ్రీనివాసపురం వద్ద రిజర్వాయర్ నిర్మించి దశాబ్దం దాటుతోంది. ప్రధాన కట్ట నిర్మాణం పూర్తయింది. కాలువ పనులు ఇంకా పూర్తి కాలేదు. అదే సమయంలో ఈ రిజర్వాయర్ కింద భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందలేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అదిగో.. ఇదిగో.. అంటూ కాలయాపన చేశారు. పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది. నష్టపరిహారం అందలేదు. కూటమి ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు.

సింగపూర్‌కు ప్రధానోపాధ్యాయుడు సిద్దారెడ్డి



ఆర్.సిద్దారెడ్డి

పెద్దమండ్యం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో మరింత అభివృద్ధి సాధనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సింగపూర్ పర్యటనకు పంపనున్నారు. పెద్దమండ్యం మండలం పాపేపల్లి పంచాయతీ గుడిసివారిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.సిద్దారెడ్డిని సింగపూర్ పర్యటనకు ఎంపిక చేసినట్లు మంగళవారం ఆపాఠశాల ఉపాధ్యాయుడు రాజేంద్ర తెలిపారు. సింగపూర్‌లో విద్యాబోధన, విద్యా విధానాలను, అధునాతన నూతన సాంకేతిక విధానాలు అధ్యయనాలు చేయనున్నారు. ఈ నెల 27వ తేదీ సింగపూర్‌కు వెళ్లి అక్కడ ఉన్న పాఠశాలలను సందర్శిస్తారని జిల్లా విద్యాశాధికారి సుబ్రమణ్యం తెలిపినట్లు వారు తెలిపారు.

పీలేరు ఆసుపత్రికి కాయకల్ప అవార్డు



పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి

పీలేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ అనుకూలమైన విధానాలు పాటించినందుకు పీలేరు ఏరియా ఆసుపత్రికి కేంద్ర ప్రభుత్వం అందజేసే ప్రతిష్ఠాత్మక 'కాయకల్ప' అవార్డు లభించింది. ఆసుపత్రి లోపల, బయట పర్యావరణ హితమైన పద్ధతులు అవలంబినందుకు పీలేరు ఆసుపత్రికి ఈ అవార్డు దక్కింది. దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో పరిశుభ్రత, నాణ్యతను పెంచడానికి, రోగులకు నాణ్యమైన సేవలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం కాయకల్ప కార్యక్రమం అమలు చేస్తోంది. ఆ పథకం లక్ష్యాలను అందుకున్న సంస్థలకు 'కాయకల్ప' పురస్కారాల పేరిట ప్రోత్సాహకాలు కూడా అందిస్తుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పీలేరు ఆసుపత్రి ప్రథమ స్థానం సాధించినట్లు ఈనెల 6వ తేదీ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఎన్‌హెచ్ఎం రాష్ట్ర డైరెక్టర్ ప్రకటించారు. అవార్డుతో పాటు పీలేరు ఆసుపత్రికి రూ.3 లక్షల నగదు ప్రోత్సాహకం ప్రకటించారు. స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సౌకర్యాలలో పరిశుభ్రత, పారిశుధ్యం, నాణ్యతను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం కాయకల్ప కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ప్రతిష్ఠాత్మకమైన కాయకల్ప అవార్డు సాధించడం పట్ల ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సమిష్టి కృషి కారణంగా అవార్డు లభించిందని, ఈ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కాకుండా ఆసుపత్రిని పరిశుభ్రంగా పెడతామని తెలిపారు.

సుండుపల్లెకు జన్ బాగీదారి అవార్డు

- కేంద్ర, రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా ప్రదానం



కేంద్ర మంత్రుల చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న పీడీ వెంకటరత్నం, పీవో అశోక్‌రెడ్డి

సుండుపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలో జరిగిన వాటర్‌షెడ్ పనులకు జన్ బాగీదారి అవార్డు వచ్చినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన వాటర్‌షెడ్ పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవార్డులు ప్రకటించారు. అందుకు గానూ రాష్ట్రంలో సుండుపల్లె మండలం మూడో స్థానంలో నిలిచింది. ఒకటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన మండలాలకు ఉత్తమ మండలాలుగా గుర్తించి వాటర్‌షెడ్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అవార్డు, రివార్డులను కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్‌చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్‌ల చేతుల మీదుగా మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పీడీ వెంకటరత్నం, మండల ప్రాజెక్టు ఆఫీసర్ అశోక్‌రెడ్డి అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అదనంగా మండలానికి రూ.20 లక్షల చెక్కును అందచేశారు. మండలంలో జరిగిన పనుల పనితీరుపై కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రశంసలు కురిపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేశ్, ఏపీడీ లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- నేడు చిన్నమండెం రాక
- పేదల గృహప్రవేశాల్లో పాల్గొననున్న సీఎం చంద్రబాబు



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ, సీఎం భద్రతా సిబ్బంది

చిన్నమండెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం చిన్నమండెం రానున్నారు. చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో పేదల గృహప్రవేశాలు, పూజా కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 10.40 గంటలకు ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో చిన్నమండెంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 10.55 గంటలకు దేవగుడిపల్లె గ్రామంలో లబ్ధిదారులు కొత్తగా నిర్మించుకున్న ఇళ్ల వద్దకు చేరుకుంటారు. హేమలత, ముంతాజ్‌బేగం గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 11.50కు దేవగుడిపల్లెలో ఏర్పాటు చేసిన ప్రజావేదికకు చేరుకుంటారు. అక్కడ పలు స్టాళ్లను పరిశీలిస్తారు. 12 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పలువురు ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. గృహనిర్మాణ లబ్ధిదారులతో ముఖ్యమంత్రి 10 నిమిషాలు మాట్లాడుతారు. పీ4 బంగారుకుటుంబం లబ్ధిదారులతో 5 నిమిషాలు మాట్లాడుతారు. తర్వాత 1.40 గంటలకు పది నిమిషాల సేపు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లతో మాట్లాడుతారు. అక్కడి నుంచి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 1.45 నుంచి 2.25 వరకు లంచ్ బ్రేక్ తీసుకుంటారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యకర్తలతో సమావేశమవుతారు. సాయంత్రం 4.10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హెలికాప్టర్‌లో కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఏర్పాట్లు దగ్గరుండి పరిశీలిస్తున్నారు.



పార్టీ కార్యకర్తల కోసం సిద్ధమైన సభావేదిక

సీఎం రాక సందర్భంగా ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది, జిల్లా యంత్రాంగం పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ పర్యవేక్షణలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆధ్వర్యంలో మంగళవారం చిన్నమండెంలోని ఏఆర్ కల్యాణ మండపంలో విస్తృత సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సీఎం భద్రతా బృందంతో కలిసి ఎస్పీ స్వయంగా కాన్వాయ్ రహార్సల్స్ నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమన్వయం చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో అదనపు ఎస్పీలు ఎం.వెంకటాద్రి, ప్రకాశ్‌బాబు, సీఎం సెక్యూరిటీ అధికారి ఎస్ఎస్ఎస్‌వీ కృష్ణారావు, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్‌హెగ్డే పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు

- అదుపు తప్పి లారీ బోల్తా
- 12 గంటల పాటు వాహన రాకపోకలకు అంతరాయం



కుక్కలదొడ్డి వద్ద నిలిచిపోయిన వాహనాలు

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోడూరు-తిరుపతి మధ్య సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు దాదాపు 12 గంటల పాటు వాహనదారులు నరకం అనుభవించారు. అన్నమయ్య-తిరుపతి జిల్లా సరిహద్దు అయిన కుక్కలదొడ్డి గ్రామ సమీపంలోని దర్గా వద్ద ప్రధాన రహదారిలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో తిరుపతి నుంచి రైల్వేకోడూరు వైపు వస్తున్న ఓ లారీ బ్రిడ్జి వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి కొందరు వ్యక్తులు నెమ్మదిగా వాహనాలను పంపించారు. అయితే మంగళవారం తెల్లవారుజాము నుంచి రెండు వైపుల నుంచి వాహనాల రద్దీ పెరిగి ఉదయం 10 గంటల వరకు రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. ఇటువైపు శెట్టిగుంట వరకు, అటువైపు మామండూరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణీకులు అష్టకష్టాలు పడ్డారు. సమాచారం తెలుసుకున్న తిరుపతి, రైల్వేకోడూరు పోలీసులు రంగప్రవేశం చేసి లారీని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఆర్ఎంపీ నిర్వాకం...

కంటి చూపు కోల్పోయిన కూలి

6

పీటీ వారెంట్‌కు కోర్టు అనుమతి

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- శిబ్యాల గ్రామంలో పరిశ్రమలు - ఉపాధి కల్పన వర్చువల్ కార్యక్రమం



శిబ్యాల గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మండిపల్లి, కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా స్థానికంగా వనరులతో సంపదను సృష్టించే ప్రణాళికలు, ముందుచూపుతో ముఖ్యమంత్రి ముందుకు వెళుతున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లోని 50 ఎంఎస్ఎంఈ పార్కుల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. జిల్లా నుంచి ఈ కార్యక్రమానికి రాయచోటి మండలంలోని శిబ్యాల గ్రామంలో మంత్రితో పాటు కలెక్టర్ నిశాంత్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఒక మహోన్నతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. దానిలో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ ఏపీఐఐసీ తరఫున ఇండస్ట్రీయల్ పార్కుల శంకుస్థాపన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే తరానికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నారు. మన ప్రాంతాల్లో ఫ్యాక్టరీలు ప్రారంభమైతే ఇక్కడున్న మన బిడ్డలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని శెట్టిగుంటపల్లి, తుమ్మలపల్లి గ్రామాల్లో మూడు ఎంఎస్ఎంఈ పార్కుల శంకుస్థాపన జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, ఆర్డీవో శ్రీనివాసులు, ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ కమలాకర్, ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి, సర్పంచ్ బండి నాగమణి, టీడీపీ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్, జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు, పారిశ్రామిక వేత్తలు, సంబంధిత అధికారులు తదితరులు హాజరయ్యారు.

జిల్లా మార్పుపై వచ్చే అసత్య ప్రచారాలు నమ్మవద్దు

అన్నమయ్య జిల్లా కేంద్రం మార్పు అంటూ సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన శిబ్యాలలో మీడియాతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి కొనసాగుతుందన్నారు. జిల్లా కేంద్రం తరలిపోతోందంటూ కొంతమంది పనిగట్టుకొని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారి మాటలను నమ్మాల్సిన అవసరం లేదన్నారు.

దుబ్బిగానిపల్లెకు కేంద్ర జలశక్తి అవార్డు

- జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు
- ట్రోఫీ, రూ.2 లక్షల నగదు బహుమతి
- 18న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం



దుబ్బిగానిపల్లె వద్ద నిర్మించిన వాటర్‌షెడ్ (ఏరియల్ వ్యూ)

మదనపల్లె టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే జాతీయస్థాయి నీటి అవార్డుల్లో భాగంగా ఈ ఏడాది జాతీయస్థాయిలో అవార్డుల్లో మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్ జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుంది. ఇందులో భాగంగా ఈనెల 18వ తేదీ న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కలెక్టర్ ఈ అవార్డుతో పాటు, ట్రోఫీ, రూ.2 లక్షల నగదు అందుకోనున్నారు.

జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు

కేంద్ర జలశక్తి ఆధ్వర్యంలో వాటర్ రిసోర్స్, రివర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వాటర్‌షెడ్ పనుల నిర్వహణ, సత్ఫలితాలు అందించే పనులకు జాతీయ స్థాయిలో అవార్డులు ప్రకటిస్తుంది. ఇందులో భాగంగా ఆరో జాతీయ నీటి అవార్డులను మంగళవారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు రెండు అవార్డులు దక్కగా వాటిలో అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్‌కు ప్రథమ స్థానం దక్కగా ప్రకాశం జిల్లా మురుగుమ్మి గ్రామం రెండో స్థానం దక్కించుకుంది. మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ దుబ్బిగానిపల్లె గ్రామం వద్ద రూ.74.96 లక్షలతో వాటర్‌షెడ్ పనులు చేశారు. 721 హెక్టార్ల మైక్రో ఏరియాలో ఊటకుంటలు, వాటర్‌షెడ్, రాత కప్పాలు నిర్మించారు. 2024 డిసెంబరులో కేంద్ర జలశక్తి బృందం సభ్యులు దుబ్బిగానిపల్లె వద్ద నిర్మించిన వాటర్‌షెడ్‌ను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చుట్టుపక్కల గుట్టల్లో కురిసిన వర్షానికి నీరంతా ఈ వాటర్‌షెడ్‌లో నిల్వ అయిన వర్షం నీటితో భూగర్భ జలాలు 400 అడుగుల నుంచి 200 అడుగులకు ఎగబాకాయి. సత్ఫలితాలు ఇచ్చిన ఈ వాటర్‌షెడ్‌ను కేంద్ర బృందం ఉత్తమ వాటర్‌షెడ్‌గా ఎంపిక చేసింది. దీంతో మదనపల్లె మండలంలోని ఈ వాటర్‌షెడ్‌ను జాతీయ స్థాయిలో ప్రథమస్థానం ఇచ్చింది. ఇందులో భాగంగా ఈనెల 18వ తేదీ ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్ ప్లీనరీ హాలులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అవార్డు అందుకోనున్నారు. ఏపీడీ లక్ష్మీనరసింహ, ఏవో నయాముద్దీన్ వాటర్‌షెడ్ నిర్మాణానికి విశేషంగా కృషి చేశారు.

ఆర్ఎంపీ నిర్వాకం...
కంటి చూపు కోల్పోయిన కూలి

వాల్మీకిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ చేసిన వైద్యం వల్ల ఓ నిరుపేద కూలి ఏకంగా కంటి చూపు కోల్పోయిన సంఘటన వాల్మీకిపురం మండలంలోని జర్రావారిపల్లెలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం మేరకు..జర్రావారిపల్లె గ్రామానికి చెందిన చుక్కా శ్రీనివాస్ యాదవ్ (45) తాపీ మేస్త్రీ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి భార్య అంజలి, కుమార్తె అశ్వని, కుమారుడు మణికంఠ ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కూలి పనులతో శ్రమించి బిడ్డలను పోషించుకుంటున్నారు. ఇదిలా ఉండగా శ్రీనివాస్‌యాదవ్ తనకు జరిగిన విషయాన్ని మంగళవారం విలేకరులతో తన గోడును వెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ ఏడాది సెప్టెంబరు 24న తన ఎడమ కన్ను నొప్పి ఎక్కువగా ఉండడంతో తాను వాల్మీకిపురంలోని ఆర్ఎంపీ డాక్టర్ చందు దగ్గరికి చికిత్స కోసం వెళ్లగా రెండు సూదులు వేసి కంటి చుక్కల మందు మాత్రలు ఇచ్చాడన్నారు. అదేరోజు మాత్రలు వాడి కంటి చుక్కలు వేసుకున్నానని అర్ధరాత్రి 12 గంటల సమయాన విపరీతమైన కంటి నొప్పి వచ్చి కన్ను బాగా ఊదిపోయి, కంటిచూపు లేకుండాపోయిందని, మరుసటి రోజు మదనపల్లెలోని కంటి ఆస్పత్రిలో మూడు రోజులు, తిరుపతి అరవింద కంటి ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకున్నా ఫలితం మాత్రం లేదన్నారు. తరువాత మళ్లీ బెంగళూరుకు వెళితే అక్కడ రెండు మూడు ఆస్పత్రులలో కనీసం చేర్చుకోలేదని, ఎట్టకేలకు నేత్రదామ ఆస్పత్రిలో చేరి చికిత్సలు చేయించుకున్నానని, అయితే కంటి నొప్పి మాత్రం తగ్గిందని చూపు మాత్రం రాలేదని, ఆపరేషన్ చేస్తే దగ్గర చూపు మాత్రం రావచ్చని అక్కడి వైద్యులు చెప్పారన్నారు. ఆర్ఎంపీ చేసిన వైద్యంతోనే తనకు ఇలా జరిగిందని కన్నీటిపర్యంతమయ్యాడు. ఒకటిన్నర నెలలో సుమారు రూ.4 లక్షలు వైద్యం ఖర్చులయ్యాయని ఇప్పుడు మళ్లీ ఆపరేషన్‌కు రూ.2 లక్షలు కావాల్సి ఉండడం ఏమి చేయాలో అర్థం కాక ఇంటికి పరిమితయ్యాయని ఆవేదన చెందుతున్నాడు. తన 18 ఏళ్ల వయసులో కూలి పనులకు వెళ్లిన సమయాన తనకుడి కంటికి రాయి తగిలి అప్పుడు కుడి కంటి చూపు కోల్పోయానని, ఇప్పుడు ఉన్న ఎడమ కన్ను కూడా ఇలా అవడంతో ఎలా బతకాలి, కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి అంటూ రోదిస్తున్నాడు. తనకు జరిగిన అన్యాయాన్ని అధికారులు గుర్తించి మరెవ్వరికీ జరగకుండా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌యాదవ్ కోరుతున్నాడు. అలాగే నిరుపేద అయిన తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. ఈ విషయమై సంబంధిత ఆర్ఎంపీ డాక్టర్ చందును వివరణ కోరగా శ్రీనివాస్ తన దగ్గరకు వచ్చినప్పుడు కంటికి సంబంధించే వైద్యం చేశానని, అయితే తిరిగి వాళ్లు కంటి పసురు లాంటివి వాడి ఉండవచ్చని చెప్పడం గమనార్హం.


శ్రీనివాస్‌యాదవ్ కంటి పరిస్థితి చూపుతున్న భార్య అంజలి

పూర్వ ఏడీఏ సావిత్రికి జరిమానా

● పరాకాష్ఠకు చేరిన అవినీతి ఫలితం
● సాటి ఉద్యోగుల నుంచే లంచాలు

కలికిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గతంలో రాయచోటి వ్యవసాయ శాఖ ఏడీఏగా పనిచేసిన సావిత్రికి జరిమానా విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చిత్తూరు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏడీఏగా పనిచేస్తున్న సావిత్రి రాయచోటిలో పనిచేసే కాలంలో తన కింది ఉద్యోగుల నుంచి లంచాల కోసం పీడించినట్లు ప్రధాన ఆరోపణ. నాలుగేళ్లుగా దీనిపై కొనసాగిన విచారణల అనంతరం సావిత్రి వైపు నుంచి సంజాయిషీలు, వివరణలు తీసుకున్న తరువాత తాజాగా ఆమెకు రెండు ఇంక్రిమెంట్లు పూర్తి సర్వీసు కాలంలో (క్యుమ్యులేటివ్ ఎఫెక్ట్‌తో) కోత విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. డబ్బులు డిమాండ్ చేస్తూ ఏడీఏ సావిత్రి వేధింపులు భరించలేక రాయచోటి డివిజన్‌లోని సచివాలయ వ్యవసాయ, పశు సంవర్ధక సహాయకులు, వీఏఏలు, ఎంపీఈవోలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అప్పటి కడప జాయింట్ కలెక్టర్ విచారణ నిర్వహించి సావిత్రి నిర్వాకాలపై 2021 మే 15 ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కమిషనరును ప్రభుత్వం ఆదేశించింది. సావిత్రి నుంచి వివరణలు తీసుకున్న అనంతరం గుంటూరు జేడీఏ వి.డి.కె.కృపాదాస్‌ను, డీడీఏ ఎన్‌సీహెచ్ బాలూనాయక్‌లను విచారణాధికారులుగా నియమించారు. ఆ తరువాత గుంటూరు అదనపు డైరెక్టర్ బి.ప్రసాద్ చేత కూడా విచారణ జరిపించారు. మొత్తం మీద అన్ని విచారణల్లోనూ సావిత్రి అవినీతికి పాల్పడ్డట్లు పూర్తి ఆధారాలున్నట్లు నివేదికలు ప్రభుత్వానికి అందాయి. చివరిసారిగా సావిత్రి వైపు నుంచి వివరణలు తీసుకున్న అనంతరం ఆమె పూర్తి సర్వీసు కాలంలో రెండు ఇంక్రిమెంట్లు కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ఆజాద్ సేవలు చిరస్మరణీయం : డీఆర్‌వో

రాయచోటి నేతాజీసర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్‌కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత తొలి విద్యాశాఖ మంత్రి, మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి డీఆర్‌వో, ప్రజాప్రతినిధులు, అధికారులు, పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌బాటలో మనందరం నడవాలన్నారు. ఆయన భారత విద్యా వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడు అన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్‌బీ మాట్లాడారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అసదుల్లా, హసీం, మహమ్మద్‌అలీ, మహమ్మద్‌ఖాన్, షామీర్, సిబాతుర్ రెహమాన్ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయ సూపరింటెండెంట్ డేవిడ్, కోఆర్డినేటర్ కరీముల్లా నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డైట్‌లో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

● విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిత్యజీవితంలో ఎదురయ్యే సవాళ్లను సునాయాసంగా అధిగమించేందుకు గుణాత్మక విద్య దోహదం చేస్తుందని, అటువంటి విద్యకు మార్గదర్శి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని డీఈవో డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. భారత స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం డైట్ కేంద్రంలో జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదట ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన చదువుల ద్వారానే మానవాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుందన్నారు. దేశ భవిష్యత్తును రూపొందించడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో విద్య ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో ఎద్దు మృతి


వెలగచర్ల వద్ద కరెంటు షాక్‌తో మృతిచెందిన ఎద్దు

పెనగలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ ఎద్దు మృతి చెందింది మండలంలోని కొండూరు గ్రామ పంచాయతీ గల వెలగచర్లలో మంగళవారం నాగరాజ అనే వ్యక్తికి చెందిన ఎద్దును మేత కోసం అతని అత్త చేలలోకి వదిలిపెట్టింది. దీంతో అది చెరువు గట్టుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ ఎద్దు లక్ష రూపాయలు విలువ చేస్తుందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కోర్టుకు హాజరుకాని నిందితుడి కోసం గాలింపు చర్యలు

రైల్వేకోడూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కోర్టుకు హాజరుకాని నిందితుడి కోసం భద్రాచలం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లు ప్రసాద్, భద్రయ్య మంగళవారం రైల్వేకోడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలోని కే.బుడుగుంటపల్లెకు చెందిన గండికోట సూర్యం 2010లో భద్రాచలం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళపై అత్యాచార యత్నం చేశాడని తెలిపారు. ఈ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు, ఆ తర్వాత కోర్టుకు హాజరు కాలేదన్నారు. కోర్టు ఆదేశాల మేరకు స్థానిక పోలీసుల సహకారంతో రైల్వేకోడూరులో గాలిస్తున్నామని తెలిపారు. నిందితుడి ఆచూకీ తెలిస్తే రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో తెలపాలని కోరారు.

ప్రజల జీవనోపాధి విధి విధానాలపై ఆరా

● లక్కిరెడ్డిపల్లె, కురబలకోటలో ట్రైనీ కలెక్టర్లు

లక్కిరెడ్డిపల్లె/కురబలకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల ప్రజల జీవనోపాధిపై ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు ఆరా తీశారు. మంగళవారం బి.యర్రగుడి గ్రామంలో వారు పర్యటించారు. గ్రామ అభివృద్ధి, పరిపాలన విధానం, ప్రజల జీవనోపాధిపై సర్పంచుతో మాట్లాడారు. గ్రామంలో పర్యటించి పరిశుభ్రతపైన అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానం, వారు తమ పిల్లలను చదివించేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. భూసమస్యలు, రెవెన్యూ విధానం, పంచాయతీ అభివృద్ధి అన్న విషయాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఐపీఎస్ తరుణ్‌యాదవ్, హర్షవర్ధన్, ఐఎఫ్ఎఫ్, తన్మేజ ఐఆర్ఎస్, సౌరబ్‌కుమార్ ఐఆర్ఎస్, వినీత్‌జాదవ్ ఐఆర్ఎస్, తనక డి.ఆనంద్, ఐఆర్ఎంఎస్, ఎంపీడీవో రెడ్డెయ్య, ఈవోపీఆర్‌డీ ఉషారాణి, పంచాయతీ సెక్రటరీ నాగమణి, అధికారులు పాల్గొన్నారు.


బి.యర్రగుడి పంచాయతీ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు


అంగళ్లులో టెర్రకోట వద్ద ట్రైనీ కలెక్టర్లు

కనసానివారిపల్లెలో...

కనసానివారిపల్లె, అంగళ్లులో ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు మంగళవారం పర్యటించారు. విధుల నిర్వహణలో శిక్షణ తీసుకునే కార్యక్రమంలో భాగంగా కురబలకోటలో మూడు రోజుల శిక్షణకు వచ్చారు. రెండోరోజు కనసానివారిపల్లె సచివాలయం, రైతు సేవా కేంద్రంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులతో సమావేశమయ్యారు. అనంతరం అంగళ్లు సమీపంలో టెర్రకోట కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ మట్టిబొమ్మల తయారీ, మార్కెటింగ్ తదితర వాటిపై టెర్రకోట ప్రతినిధులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్లు ప్రతివలామా, హరిప్రసాద్ పోతరాజు, ఆశిశర్మ, విటోర్ భరద్వాజ్, పాటిల్ కృష్ణ బద్రువన్, ఆనంద్ ప్యారేలాల్, ఎంపీడీవో గంగయ్య, సర్పంచ్ కృష్ణారెడ్డి, ఏపీఎం శ్రీనివాసులు, కార్యదర్శులు గిరి, రామప్పనాయుడు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో



కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్న గారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వేగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్‌స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు మందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆద్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

ట్రాక్టర్‌ను దొంగిలించిన వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్, నిందితుని చూపుతున్న పోలీసులు

కాశినాయన నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సావిశెట్టిపల్లెలో వారం రోజుల క్రితం ఓ ట్రాక్టర్ చోరీకి గురైంది. ఈ కేసులోని నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ముడమాల సుదర్శన్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్, ట్రిల్లర్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేసి పోట్లదుర్తి గ్రామానికి చెందిన పులి పెద్ద గంగరాజు కుమారుడు అంజన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. అతను ట్రాక్టర్, ట్రిల్లర్ చోరీ చేసినట్లు అంగీకరించడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రైల్వేగేటును ఢీకొన్న పాల వ్యాన్

● కమలాపురంలో గంటపాటు ట్రాఫిక్ జామ్



గేటు దెబ్బతినడంతో నిలిచిపోయిన వాహనాలు

కమలాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైల్వేగేటును పాలవ్యాను ఢీకొనడంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించిన సంఘటన కమలాపురం పట్టణంలో చోటు చేసుకుంది. మంగళవారం సాయంత్రం రైల్వే గేటు దాటుతున్న సందర్భంలో పాల వ్యాను ప్రమాదవశాత్తు గేటును ఢీకొంది. దీంతో రైల్వేగేటుకు డ్యామేజీ అయ్యింది. ఈ సమాచారం తెలుసుకున్న రైల్వే సిబ్బంది రైల్వే గేటును రిపేరు చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే రిపేరుకు ఎక్కువ సమయం పట్టడం, స్కూలు వదలే సమయం కావ డంతో విద్యార్థులు, ప్రయాణికుల రద్దీతో ట్రాఫిక్ స్తంభించి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటపాటు గేటు వద్దనే నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా ఇటీవల కురిసిన వర్షానికి అండర్ బ్రిడ్జిలో నీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ద్విచక్రవాహనదారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మళ్లీ కేబుల్ చోరీ

● వరుస సంఘటనలతో ఆందోళనలో రైతులు

లింగాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారి చింతల, దిగువపల్లె గ్రామ పొలాల్లో బోరుబావులకు రైతులు ఏర్పాటు చేసుకున్న కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఇప్పటికే అరటి ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా దొంగలు వరుసగా కేబల్ వైర్లను చోరీ చేస్తుండడతో రైతులు ఆందోళనలకు గురవుతున్నారు. సోమవారం రాత్రి సుమారు 40 మంది రైతులకు సంబంధించిన కేబుల్ వైర్లను దొంగతనం చేశారు. దీని విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని రైతులు చెబుతున్నారు. దొంగలు కేబుల్ వైర్‌ను కాల్చి గుజిరీకి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని, మళ్లీ కొత్తగా కేబబుల్ వైర్ కొనాలంటే ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తోందన్నారు. దొంగతనాలు వరుసగా జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని రైతులు వాపోతున్నారు. పోలీసులు కేబుల్ దొంగలను పట్టుకొని దొంగతనాలు జరగకుండా చూడాలని వారు పేర్కొన్నారు.

హత్య కేసులో 9 మంది అరెస్టు

కడప క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పెద్దదర్గా సమీపంలో శనివారం అర్ధరాత్రి అబూబకర్ అనే యువకుడిని హత్య చేసిన కేసుకు సంబంధించి 9 మందిని నకాశ్ సమీపంలోని కేసీ కాల్వ వద్ద మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ గంటా సుబ్బారావు తెలిపారు. సీఐ వివరాల మేరకు... కడప కుమ్మరి కుంటకు చెందిన అబుజార్, ఆలియస్ అబుషేక్ మహ్మద్ యూసఫ్ మధ్య మనస్పర్ధలు ఉండేవి. శనివారం ఒంటరిగా ఉన్న అబూబకర్‌ను కత్తితో పొడిచి హత్య చేసినట్లు తెలిపారు. ఈకేసుకు సంబంధించి నిందితులైన అబూబజార్ ఆలియాస్ యూసుఫ్, గౌస్‌నగర్‌కు చెందిన ఆజంబాషా, ఆసిఫ్, లతీఫ్‌లతో పాటు మరో నలుగురు మైనర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కత్తి, ఓ సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఐదుగురిని రిమాండుకు, మైనర్లను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

కమలాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చదిపిరాళ్ల పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న పెంచలయ్యకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ఎంపీడీవో గౌస్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొని, ఫొటోలను వాట్సప్ గ్రూపులో పంపించాల్సి ఉంది. అయితే చదిపిరాళ్ల పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య పాత ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీ కార్యదర్శికి మెమో ఇచ్చి వివరణ కోరారు. ఈ మేరకు పెంచలయ్యకు షోకాజ్ నోటీసులు ఇచ్చి, మూడురోజుల్లో వివరణ ఇవ్వాల్సిందిగా కోరామని ఆయన తెలిపారు.

ప్రతి కుటుంబంలో పారిశ్రామికవేత్త... ప్రభుత్వ లక్ష్యం

మైదుకూరు నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. మంగళవారం నంద్యాలంపేటలో 42 ఎకరాలలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కు శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డ్వామా పీడీ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తోందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తోందని తెలిపారు. బద్వేల్ ఆర్‌డీఓ చంద్రమోహన్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ఏరియాలో పరిశ్రమలను ఏర్పాటు చేసుకున్న నిరుద్యోగ యువతకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడమేకాకుండా మౌలిక వసతులను ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి,రాష్ట్ర కనీసవేతనాల సలహామండలి డైరెక్టర్ దాసరిబాబు మాట్లాడుతూ ప్రభు త్వ రాయితీతో పాటు, బ్యాంకుల ద్వారా రుణాలు పొందే అవకాశం ఉన్నందున మహిళా సంఘాలు, నిరుద్యోగులు పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు రాజసింహ నరేంద్ర, సొసైటీ చైర్మన్ మారుతీ, బీఎన్ శ్రీను, ఆర్.శ్రీనివాసులు, ధనపాల రవి, మెప్మా అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు



మిల్లెట్స్ ఆహార ఉత్పత్తుల వ్యాపారవేత్త ప్రమీలకు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న బీటెక్ రవి

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవకాశాలు కల్పిస్తున్నారని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ ఇస్టా ఆడిటోరియంలో పరిశ్రమలు- ఉపాధి కల్పన అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీటెక్ రవి మాట్లాడుతూ ఎవరిమీద ఆధార పడకుండా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. పులివెందులలో ఏపీఐఐసీ భూములు ఉన్నాయి, ఇక్కడ పరిశ్రమలు స్థాపిం చుకునేందుకు అవకాశం ఉందన్నారు. పరిశ్రమలు పెట్టి పది మందికి ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. అనంతరం డ్వాక్రా రుణాలతో పరిశ్రమలు స్థాపించిన ప్రమీల, వెంగమ్మలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, మార్కెట్ యార్డు మాజీచైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పులివెందుల వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి, సంయు గ్లాస్ ఫ్యాక్టరీ, ఆదిత్య బిర్లా ఫ్యాక్టరీ ప్రతినిధు లు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఏపీ స్టేట్ లెవల్ మినీ (అండర్-11 బాల, బాలికల) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 250 మందికి పైగా క్రీడాకారులు హాజరు కాగా, క్వాలిఫై రౌండ్స్ ముగిసిన వారిని మెయిన్ డ్రాకు ఎంపిక చేశారు. తదుపరి ఈ నెల 9 నుంచి లీగ్ మ్యాచ్ నిర్వహించి 10న ప్రీ క్వార్టర్స్, క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు చేట్టారు. చివరి రోజు అయిన మంగళవారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్ నిర్వహించి విజేతలను ప్రకటించారు.

రాష్ట్రస్థాయి మినీ అండర్ 11 బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల బాలుర విభాగంలో సింగిల్ ఫైనల్ విజేతగా కార్తీక్ (అనంతపురం) నిలచారు. బాలికల సింగిల్ విభాగంలో సీఈ ప్రియాంక్ (వైజాగ్) విజేతగా నిలిచారు. బాలుర డబుల్స్ విభాగంలో ఫైనల్ విజేతగా ఎం.దేవాన్ష్ రుషి, ఎస్‌షాహిర్ (చిత్తూరు) విజేతలుగా నిలిచారు. అలాగే బాలికల డబుల్స్ విభాగంలో కె.శ్రీఆద్యా రెడ్డి (వెస్ట్ గోదావరి), మధులిక (చిత్తూరు) విజేతలుగా నిలిచారు. విజేతలకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.భాస్కర్‌రెడ్డి హాజరై బహుమతులు అందించారు. డీఎస్‌డీవో గౌస్‌బాషా, అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజుతో పాటు పలువురు కోచ్‌లు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



విజేతలతో అసోసియేషన్ ప్రతినిధులు

జాతీయ విపత్తుల శిక్షణ పూర్తి చేసుకున్న కడప స్కౌట్ విద్యార్థి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 7వ జాతీయ విపత్తుల శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో అక్టోబరు 15 నుంచి నిర్వహించిన 22రోజుల ప్రత్యేక శిక్షణ శిబి రంలో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన స్కౌట్ విద్యార్థి పి.వెంక టరమణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఏకైక అభ్యర్థిగా ప్రాతినిధ్యం వహించారు. కడప నగరం శ్రీహరి డిగ్రీ కళాశా లలో చదువుకునే సమయంలో స్కౌట్ తరఫున గతంలో ఈయన పాల్గొన్నారు. కాగా యువ ఆపద మిత్ర శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు ఏపీ నుంచి వెంకటరమణ ఒక్కరికే అవకాశం లభించడం విశేషం. ఈ సంద ర్భంగా జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు వెంకటరమణకు అభినందనలు తెలిపారు.



రూ.14 కోట్లతో ఎంఎస్‌ఎంఈ పార్కు ప్రారంభం

ప్రొద్దుటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామంలో రూ.14 కోట్లతో ఎంఎస్ ఎంఈ పార్కును ముఖ్యమంత్రి చంద్ర బాబు విజయవాడలో వర్చువల్‌గా ప్రారంభించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ సభా భవనంలో పరిశ్రమలు, ఉపాధి కల్పన అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లా డుతూ ప్రొద్దుటూరులో రూ.14 కోట్లతో చేపట్టే ఈ ఎంఎస్‌ఎంఈ పార్కు ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పన అవకాశాలు పెరుగుతా యన్నారు. ఈ పనులను ఏపీఐఐసీ త్వరితగతిన చేపట్టాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి మాట్లాడుతూ గోల్డ్ మార్కెట్‌కు అనుసంధానంగా ఏర్పాటు కాబోయే ఈపరిశ్రమలో ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బచ్చల పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, జడ్పీ ఈఈవో ఓబులమ్మ, ఆర్‌డీవో సాయిశ్రీ, వాల్మీకి బోయ రాష్ట్ర డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ వద్ది సురేఖ, ఎంపీడీవో సూర్యనారాయణ, రాజుపాళెం ఎంపీ డీవో రామనాథ్‌రెడ్డి, మెప్మా అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఎంఎస్‌ఎంఈ పార్కు ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, అధికారులు

యువతకు ఆదర్శం అబుల్‌కలాం ఆజాద్

కడప క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేటి తరం యువత మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య పేర్కొన్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ మాట్లాడుతూ మౌలానా ఆజాద్ జయంతిని దేశంలో జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. ఆయన ప్రఖ్యాత పండితుడని, అరబిక్, ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలి అనేకభాషల్లో ప్రావీణ్యుడన్నారు. స్వాతంత్ర్య సమరఘట్టంలో ముఖ్య నాయకులన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు శివరాముడు, శ్రీశైలరెడ్డి, సోమశేఖర్‌నాయక్, డీపీవో ఏవో వెంకటరమణ, ఆర్‌ఎస్‌ఐలు వెంక టేశ్వర్లు, స్వామినాయక్, అప్పలనాయుడు, డీపీవో, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.



ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ

పరిశుభ్రతతోనే పంచాయతీల అభివృద్ధి

చెన్నూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కాళహస్తి సీనియర్ ఫ్యాకల్టీ సరళ అన్నారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో జిల్లాస్థాయిలో అన్ని మండలాల ఎంపీడీవోలకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో సీనియర్ ఫ్యాకల్టీ మాట్లాడుతూ సుస్థిరత అభివృద్ధికి, మంచి ఆదాయ వనరులకు గ్రామ పంచాయతీలు కీలకమన్నారు. సొంత ఆలోచనలతో స్థానికంగా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రతి మండలంలో అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. జడ్పీ సీఈవో ఓబులమ్మ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి, పరిశుభ్రత ఎవరికి వారు విధి నిర్వహణలో నిక్కచ్చిగా పనిచేసినప్పుడే సాధ్యమ వుతుందన్నారు. తద్వారా ఆ పంచాయతీలు రాబోవు కాలంలో మంచి అభివృద్ధితో ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీపీవో రాజ్యలక్ష్మి, డీడీవో మైథిలి, డీఎల్‌డీవో శేషయ్య, డీఎల్‌పీవో రమణారెడ్డి, ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఎస్పీ



వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

వేంపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రమేయం ఉన్నట్లు తెలిసినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. వేంపల్లె పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. స్థానిక పోలీ సులు, అధికారులతో శాంతి భద్రతలపై ఆరా తీశారు. ఫ్యాక్షన్ గ్రామాల పరిస్థితుల గురించి వాకబు చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా పోలీసులు చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో నిద్రించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, బెట్టింగ్ తదితరవి ఎక్కడ జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. పోలీసులకు ప్రమేయం ఉన్నట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని, రాత్రి వేళల్లో నైట్‌బీట్‌లు పకడ్బందీగా ఉండాలని, నేరాలు జరగకుండా ముందు జాగ్రత్తగా పోలీసుల పనితీరు ఉండాలన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజల పట్ల పోలీసులు మర్యాదగా ప్రవర్తించాలని, సమ స్యలను విని ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మెరుగుపరచాలన్నారు.

పటిష్ట స్థితిలో కడప జట్టు

● స్వల్ప స్కోర్‌కే చేతులెత్తేసిన అనంతపురం



శివచరణ్ (కడప), పంకజ్ (అనంతపురం), మణిదీప్ (చిత్తూరు)

కడప స్పోర్ట్స్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా మంగళవారం నెల్లూరు జట్టుపై కడప జట్టు పటిష్ట స్థితిలో వుండగా, చిత్తూరు జట్టుపై అనంతపురం జట్టు స్వల్ప స్కోర్‌కే చేతులెత్తేసింది. వివరాలిలా.....

నగర శివారు ప్రాంత కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టింది. మొదటిరోజు ఆట ముగిసే సమ యానికి తన మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 280 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. ఇందులో శివచరణ్ 151 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు- అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం తన మొదటి ఇన్నింగ్స్‌లో 54 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 146 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో పంకజ్ 88 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్ మణిదీప్ 5 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 40.1 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 80 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు మరో 66 పరుగుల వెనుకంజలో వుంది.

కోడిగాండ్లపల్లెలో విషజ్వరంతో మహిళ మృతి

ముద్దనూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కోడిగాండ్లపల్లెలో ఓ మహిళ విషజ్వరంతో మృతి చెందింది. రెండు నెలల క్రితం గ్రామంలో గండికోట బ్యాక్ వాటర్ వల్ల ప్రజలకు విషజ్వరాలు సోకి ఓ చిన్నారి మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరవక ముందే గ్రామంలోని గంగాదేవి(40)అనే మహిళ విషజ్వరంతో మృతి చెందడంతో గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే... కోడిగాండ్లపల్లెకు చెందిన జి.నడిపి సుబ్బరాయుడుకు 20 సంవత్సరాల క్రితం గంగాదేవితో వివాహమైంది. సంతానం లేకపోవడంతో ఒకటిన్నర సంవత్సరం క్రితం సంతానం కోసం చైనైలోని ఓ ఆసుపత్రిలో కృత్రిమ గర్భధారణ చేయించుకున్నారు. తరువాత కొండాపురంలో నున్న అమ్మగారి ఇంటి వద్ద ఉండి కొద్ది నెలలు ప్రొద్దుటూరులో చికిత్స చేయించుకున్నారు. అనంతరం ఇద్దరు కవలలు అవని, హర్షితలు జన్మించారు. ఇప్పటికి చిన్నారుల వయస్సు 10నెలలు, నాలుగు నెలల క్రితం గంగాదేవి పిల్లలను తీసుకొని కోడిగాండ్లపల్లెకు వచ్చింది. 15 రోజుల నుంచి అనారోగ్యానికి గురైంది. విషజ్వరంతో బాధపడుతున్న గంగాదేవిని ప్రొద్దుటూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. వారం రోజుల క్రితం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. మృతదేహాన్ని కోడిగాండ్లపల్లె తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. కేవలం గండికోట బ్యాక్ వాటర్ వల్ల విషజ్వరంతోనే తన భార్య మృతి చెందినట్లు సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిలేని చిన్నపిల్లలను చూసి గ్రామం శోకసంద్రంలో మునిగింది.



గంగాదేవి మృతదేహం అనాథలుగా మారిన పసిపిల్లలు



గంగాదేవి (ఫైల్)

విషజ్వరాలు లేవు....

నెల రోజులుగా కోడిగాండ్లపల్లెలో విషజ్వరాలు లేవు. గంగాదేవి చెన్నైలో పిల్లల కోసం కృత్రిమ గర్భధారణ చేయించుకుంది. తరువాత కొండాపురంలోని తల్లిగారి ఇంటిలో ఉంది. కోడిగాండ్లపల్లెకు ఇప్పటి వరకు రాలేదు. అనారోగ్యంతో ఉండటంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. ఆధార్‌కార్డు ఆధారంగా ముద్దనూరు మండల వాసిగా గుర్తించారు.

- కరిష్మ, ప్రభుత్వ వైద్యురాలు, ముద్దనూరు

కృత్రిమ మేథస్సు మంచిదే...

● మానవతా విలువలు ముఖ్యం ● వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): కృత్రిమ మేథస్సు యుగంలో మానవతా విలువలు, సృజనాత్మకత, నైతిక స్పృహను కాపాడుకోవాల్సిన అవ సరం ఉందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. మంగళ వారం జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని వైవీయూ సర్ సీవీ రామన్ సైన్స్ భవనంలో వీసీ అధ్యక్షతన అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

అనంతరం జరిగిన సమావేశంలో కర్నూ లు డాక్టర్ అబుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వై.నరసింహులు కీలక ఉపన్యాసం చేస్తూ డిజిటల్ లెర్నింగ్ వాతావరణంలో మానవత్వం ప్రాముఖ్యతను వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పీఎం ఉష సమన్వయకర్త డాక్టర్ టి.చంద్రశేఖర్ సమన్వయం చేశారు. ఉర్దూ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రియాజున్నీసా ఆధ్వర్యంలో పీఎం ఉష, మైనారిటీ సెల్, ఉర్దూ విభాగం సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించగా పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

బోరెడ్డిగారి పల్లెలో ప్రజా దర్బార్

చిన్నమండెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో మంగళవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, అధికారుల నుంచి వినతి పత్రాలు స్వీకరించి ఆయా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సంద ర్భంగా మంత్రిని పలువురు అధికారులు, నాయకులు శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు.



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి



పరిశ్రమలతో ఉపాధి కల్పన

● ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట గ్రామంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖపట్నం నుంచి ఆన్‌లైన్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శెట్టిగుంటలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 13.40 కోట్లతో ఒక కుటుంబం-ఒక పరిశ్రమ పథకం లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇండ్రస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ 2009 లోనే శెట్టిగుంట లో 20.27 ఎకరాలను పరిశ్రమ అభివృద్ధి కోసం కేటాయించిందన్నారు. ఈ భూమి లోనే ఎంఎస్‌ఎంఈ (ఎఫ్‌ఎఫ్‌సీ) ఫేజ్-2కు శంకుస్థాపన చేశారన్నారు. ఈ పథకంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. చిన్న పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయలు అందుబాటులోకి వస్తాయన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, కూటమి నాయకులు నాగినేని వెంకటరమణ, శెట్టిగుంట సర్పంచ్ శివశైలజ, ఎస్‌వీ గోపాల్, కంచిరాజు రామరాజు, పగడాల చంద్రశేఖర్, న్యాయవాది చంద్రశేఖర్, నియోజకవర్గ స్పెషలాఫీసర్, డీఎల్‌డీవో నరసింహమూర్తి, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, ఎంపీడీవో నాగిరెడ్డి, పరిశ్రమలు, ఏపీఐఐసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శెట్టిగుంట సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ప్రతి సమస్యకు పరిష్కారం.. జనవాణి ధ్యేయం

మండలం లోని మైసూరివారిపల్లె వద్ద ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో జనవాణి కార్యక్రమాన్ని ఐదు మండలాల్లో నిర్వహిస్తామన్నారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పగడాల వరలక్ష్మీ, పగడాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

సుండుపల్లె, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దినేని కాలువ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం కుర్వపల్లికి చెందిన చిన్నరెడ్డెయ్య రూ.10 వేలు విలువ చేసే విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రవీంద్రనాయక్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి దాతలు అందజేయాలని పిలుపునిచ్చారు. అనంతరం దాతను ఘనంగా సన్మానించారు.



ఉనికి కోసమే వైసీపీ ఉద్యమం

రాజంపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉనికి కాపాడుకునేందుకే ఉద్యమాల పేరుతో వైసీపీ విద్యార్థులు, యువతను రెచ్చగొడుతోందని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణు గోపాల్ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణపేరుతో అసత్య ప్రచారానికి ప్రయత్నిస్తోందన్నారు. జగన్ అసత్య ప్రచారాలు ఎవరూ నమ్మరని రాష్ట్రంలో విద్యార్థులు, యువతే వైసీపీకి తగిన బుద్ధి చెబుతా రన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, నాయకులు చుక్కా యానాది, రెడ్డిశేఖర్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

లక్కిరెడ్డిపల్లె, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటపల్లి గ్రామంలో మంగళవారం ఏపీ మోడల్ స్కూల్ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య ప్రోగ్రాం ఆఫీసర్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాంకు నివాళి

చిట్వేలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకని చిట్వేలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కామాటం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రిగా 11 సంవత్సరాలు సేవలు అందించారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు నాగరత్నమ్మ, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శశాంక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు

రాజంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల ఉపకరణాల కోసం ఈనెల 13న గురువారం ఉదయం 9 గంటలకు రాజంపేట మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట, నందలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, పెనగలూరు, చిట్వేలి మండలాలకు సంబంధించి 18 ఏళ్ళ లోపు దివ్యాంగులైన విద్యార్థులు సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, ఆధార్, రేషన్ కార్డులు, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు తీసుకు రావాలన్నారు. యూడీఐడీ కార్డులేని వారు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్ధారణ పరీక్షల తర్వాత అవసరమైన వారికి బ్యాటరీ సైకిల్, వీల్‌చైర్, ట్రైసైకిళ్లు, రోలేటర్స్, చంక కర్రలు లాంటి ఉపకరణాలు అందజేస్తారని తెలిపారు.

అయోడిన్ లోపంపై విద్యార్థినులకు అవగాహన

నందలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా అయోడిన్ లోపంపైన ఆడపూరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అయోడిన్ లోపంతో ఏర్పడే సమస్యలు, నివారణ, చికిత్సపై ఐజీడీ కోఆర్డినేటర్ డాక్టర్ ఇంతియాజ్ వివరించారు. వైద్యాధికారులు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్ మాట్లాడుతూ వంటల్లో అయోడిన్ కలిగిన ఉప్పును వాడాలని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విశదీకరించారు. ఈ కార్యక మంలో కళాశాల ప్రిన్సిపాల్ హైమావతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టి.వెంకటనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీలు సబిత, ఆరిఫ్, ఏఎన్‌ఎం శాంతకుమారి, లెక్చరరు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

సిద్దవటం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దారు మాధవీలతకు మంగళవారం చేనేత కార్మికులు విన్నవించారు. మాధవరం-1 ఎస్‌కేఆర్‌నగర్ ప్రాంతంలోని సర్వేనంబరు 1069/2లోని స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చదును చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎంపీ నిర్వాకం... కంటి చూపు కోల్పోయిన కూలి

వాల్మీకిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ చేసిన వైద్యం వల్ల ఓ నిరుపేద కూలి ఏకంగా కంటి చూపు కోల్పోయిన సంఘటన వాల్మీకిపురం మండలంలోని జర్రావారిపల్లెలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం మేరకు..జర్రావారిపల్లె గ్రామానికి చెందిన చుక్కా శ్రీనివాస్ యాదవ్ (45) తాపీ మేస్త్రీ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి భార్య అంజలి, కుమార్తె అశ్విని, కుమారుడు మణికంఠ ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కూలి పనులతో శ్రమించి బిడ్డలను పోషించుకుంటున్నారు. ఇదిలా ఉండగా శ్రీనివాస్‌యాదవ్ తనకు జరిగిన విషయాన్ని మంగళవారం విలేకరులతో తన గోడును వెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ ఏడాది సెప్టెంబరు 24న తన ఎడమ కన్ను నొప్పి ఎక్కువగా ఉండడంతో తాను వాల్మీకిపురంలోని ఆర్ఎంపీ డాక్టర్ చందు దగ్గరికి చికిత్స కోసం వెళ్లగా రెండు సూదులు వేసి కంటి చుక్కల మందు మాత్రలు ఇచ్చాడన్నారు. అదేరోజు మాత్రలు వాడి కంటి చుక్కలు వేసుకున్నానని అర్ధరాత్రి 12 గంటల సమయాన విపరీతమైన కంటి నొప్పి వచ్చి కన్ను బాగా ఉబిపోయి, కంటిచూపు లేకుండాపోయిందని, మరుసటి రోజు మదనపల్లెలోని కంటి ఆస్పత్రిలో మూడు రోజులు, తిరుపతి అరవింద కంటి ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకున్నా ఫలితం మాత్రం లేదన్నారు. తరువాత మళ్లీ బెంగళూరుకు వెళితే అక్కడ రెండు మూడు ఆస్పత్రులలో కనీసం చేర్చుకోలేదని, ఎట్టకేలకు నేత్రదామ ఆస్పత్రిలో చేరి చికిత్సలు చేయించుకున్నానని, అయితే కంటి నొప్పి మాత్రం తగ్గిందని చూపు మాత్రం రాలేదని, ఆపరేషన్ చేస్తే దగ్గర చూపు మాత్రం రావచ్చని అక్కడి వైద్యులు చెప్పారన్నారు. ఆర్ఎంపీ చేసిన వైద్యంతోనే తనకు ఇలా జరిగిందని కన్నీటిపర్యంతమయ్యాడు. ఒకటిన్నర నెలలో సుమారు రూ.4 లక్షలు వైద్యం ఖర్చులయ్యాయని ఇప్పుడు మళ్లీ ఆపరేషన్‌కు రూ.2 లక్షలు కావాల్సి ఉండడం ఏమి చేయాలో అర్థం కాక ఇంటికి పరిమితయ్యాయని ఆవేదన చెందుతున్నాడు. తన 18 ఏళ్ల వయసులో కూలి పనులకు వెళ్లిన సమయాన తనకుడి కంటికి రాయి తగిలి అప్పుడు కుడి కంటి చూపు కోల్పోయానని, ఇప్పుడు ఉన్న ఎడమ కన్ను కూడా ఇలా అవడంతో ఎలా బతకాలి, కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి అంటూ రోదిస్తున్నాడు. తనకు జరిగిన అన్యాయాన్ని అధికారులు గుర్తించి మరెవ్వరికీ జరగకుండా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌యాదవ్ కోరుతున్నాడు. అలాగే నిరుపేద అయిన తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. ఈ విషయమై సంబంధిత ఆర్ఎంపీ డాక్టర్ చందును వివరణ కోరగా శ్రీనివాస్ తన దగ్గరకు వచ్చినప్పుడు కంటికి సంబంధించే వైద్యం చేశానని, అయితే తిరిగి వాళ్లు కంటి పసురు లాంటివి వాడి ఉండవచ్చని చెప్పడం గమనార్హం.


శ్రీనివాస్‌యాదవ్ కంటి పరిస్థితి చూపుతున్న భార్య అంజలి

పూర్వ ఏడీఏ సావిత్రికి జరిమానా

- పరాకాష్టకు చేరిన అవినీతి ఫలితం
- సాటి ఉద్యోగుల నుంచే లంచాలు

కలికిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గతంలో రాయచోటి వ్యవసాయ శాఖ ఏడీఏగా పనిచేసిన సావిత్రికి జరిమానా విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చిత్తూరు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏడీఏగా పనిచేస్తున్న సావిత్రి రాయచోటిలో పనిచేసే కాలంలో తన కింది ఉద్యోగుల నుంచి లంచాల కోసం పీడించినట్లు ప్రధాన ఆరోపణ. నాలుగేళ్లుగా దీనిపై కొనసాగిన విచారణల అనంతరం సావిత్రి వైపు నుంచి సంజాయిషీలు, వివరణలు తీసుకున్న తరువాత తాజాగా ఆమెకు రెండు ఇంక్రిమెంట్లు పూర్తి సర్వీసు కాలంలో (క్యుమ్యులేటివ్ ఎఫెక్ట్‌తో) కోత విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. డబ్బులు డిమాండ్ చేస్తూ ఏడీఏ సావిత్రి వేధింపులు భరించలేక రాయచోటి డివిజన్‌లోని సచివాలయ వ్యవసాయ, పశు సంవర్ధక సహాయకులు, వీఏఏలు, ఎంపీఈవోలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అప్పటి కడప జాయింట్ కలెక్టర్ విచారణ నిర్వహించి సావిత్రి నిర్వాకాలపై 2021 మే 15 ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కమిషనరును ప్రభుత్వం ఆదేశించింది. సావిత్రి నుంచి వివరణలు తీసుకున్న అనంతరం గుంటూరు జేడీఏ వి.డి.కె.కృపాదాస్‌ను, డీడీఏ ఎన్‌సీహెచ్ బాలూనాయక్‌లను విచారణాధికారులుగా నియమించారు. ఆ తరువాత గుంటూరు అదనపు డైరెక్టర్ బి.ప్రసాద్ చేత కూడా విచారణ జరిపించారు. మొత్తం మీద అన్ని విచారణల్లోనూ సావిత్రి అవినీతికి పాల్పడ్డట్లు పూర్తి ఆధారాలున్నట్లు నివేదికలు ప్రభుత్వానికి అందాయి. చివరిసారిగా సావిత్రి వైపు నుంచి వివరణలు తీసుకున్న అనంతరం ఆమె పూర్తి సర్వీసు కాలంలో రెండు ఇంక్రిమెంట్లు కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ఆజాద్ సేవలు చిరస్మరణీయం : డీఆర్వో

రాయచోటి నేతాజీసర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్‌కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత తొలి విద్యాశాఖ మంత్రి, మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి డీఆర్వో, ప్రజాప్రతినిధులు, అధికారులు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌బాటలో మనందరం నడవాలన్నారు. ఆయన భారత విద్యా వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడు అన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్. మస్తాన్‌బీ మాట్లాడారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అసదుల్లా, హసీం, మహమ్మద్‌అలీ, మహమ్మద్‌ఖాన్, షామీర్, సిబాతుర్ రెహమాన్ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయ సూపరింటెండెంట్ డేవిడ్, కోఆర్డినేటర్ కరీముల్లా నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డైట్‌లో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

- విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిత్యజీవితంలో ఎదురయ్యే సవాళ్లను సునాయాసంగా అధిగమించేందుకు గుణాత్మక విద్య దోహదం చేస్తుందని, అటువంటి విద్యకు మార్గదర్శి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని డీఈవో డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. భారత స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం డైట్ కేంద్రంలో జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదట ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన చదువుల ద్వారానే మానవాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుందన్నారు. దేశ భవిష్యత్తును రూపొందించడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో విద్య ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో ఎద్దు మృతి

పెనగలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ ఎద్దు మృతి చెందింది మండలంలోని కొండూరు గ్రామ పంచాయతీ గల వెలగచర్లలో మంగళవారం నాగరాజ అనే వ్యక్తికి చెందిన ఎద్దును మేత కోసం అతని అత్త చేలలోకి వదిలిపెట్టింది. దీంతో అది చెరువు గట్టుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ ఎద్దు లక్ష రూపాయలు విలువ చేస్తుందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.


వెలగచర్ల వద్ద కరెంటు షాక్‌తో మృతిచెందిన ఎద్దు

కోర్టుకు హాజరుకాని నిందితుడి కోసం గాలింపు చర్యలు

రైల్వేకోడూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కోర్టుకు హాజరుకాని నిందితుడి కోసం భద్రాచలం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్ల ప్రసాద్, భద్రయ్య మంగళవారం రైల్వేకోడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలోని కే.బుడుగుంటపల్లెకు చెందిన గండికోట సూర్యం 2010లో భద్రాచలం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళపై అత్యాచార యత్నం చేశాడని తెలిపారు. ఈ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు, ఆ తర్వాత కోర్టుకు హాజరు కాలేదన్నారు. కోర్టు ఆదేశాల మేరకు స్థానిక పోలీసుల సహకారంతో రైల్వేకోడూరులో గాలిస్తున్నామని తెలిపారు. నిందితుడి ఆచూకీ తెలిస్తే రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో తెలపాలని కోరారు.

ప్రజల జీవనోపాధి విధి విధానాలపై ఆరా

- లక్కిరెడ్డిపల్లె, కురబలకోటలో ట్రైనీ కలెక్టర్లు

లక్కిరెడ్డిపల్లె/కురబలకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల ప్రజల జీవనోపాధిపై ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు ఆరా తీశారు. మంగళవారం బి.యర్రగుడి గ్రామంలో వారు పర్యటించారు. గ్రామ అభివృద్ధి, పరిపాలన విధానం, ప్రజల జీవనోపాధిపై సర్పంచుతో మాట్లాడారు. గ్రామంలో పర్యటించి పరిశుభ్రతపైన అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానం, వారు తమ పిల్లలను చదివించేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. భూసమస్యలు, రెవెన్యూ విధానం, పంచాయతీ అభివృద్ధి అన్న విషయాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఐపీఎస్ తరుణ్‌యాదవ్, హర్షవర్ధన్, ఐఎఫ్ఎఫ్, తన్మైజ ఐఆర్ఎస్, సౌరబ్‌కుమార్ ఐఆర్ఎస్, వినీత్‌జాదవ్ ఐఆర్ఎస్, తనక డి.ఆనంద్, ఐఆర్ఎంఎస్, ఎంపీడీవో రెడ్డెయ్య, ఈవోపీఆర్డీ ఉషారాణి, పంచాయతీ సెక్రటరీ నాగమణి, అధికారులు పాల్గొన్నారు.


బి.యర్రగుడి పంచాయతీ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు

కనసానివారిపల్లెలో...

కనసానివారిపల్లె, అంగళ్లలో ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు మంగళవారం పర్యటించారు. విధుల నిర్వహణలో శిక్షణ తీసుకునే కార్యక్రమంలో భాగంగా కురబలకోటలో మూడు రోజుల శిక్షణకు వచ్చారు. రెండోరోజు కనసానివారిపల్లె సచివాలయం, రైతు సేవా కేంద్రంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులతో సమావేశమయ్యారు. అనంతరం అంగళ్ల సమీపంలో టెర్రకోట కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ మట్టిబొమ్మల తయారీ, మార్కెటింగ్ తదితర వాటిపై టెర్రకోట ప్రతినిధులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్లు ప్రతివలామా, హరిప్రసాద్ పోతరాజు, ఆశిశర్మ, విబోర్ భరద్వాజ్, పాటిల్ కృష్ణ బధ్రువన్, ఆనంద్ ప్యారేలాల్, ఎంపీడీవో గంగయ్య, సర్పంచ్ కృష్ణారెడ్డి, ఏపీఎం శ్రీనివాసులు, కార్యదర్శులు గిరి, రామప్పనాయుడు పాల్గొన్నారు.


అంగళ్లులో టెర్రకోట వద్ద ట్రైనీ కలెక్టర్లు

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.

కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం



'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సే మీడియాతో పంచుకున్నారు.

- కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.
- నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనుసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్,శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేసే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆద్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

ట్రాక్టర్‌ను దొంగిలించిన వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్, నిందితుని చూపుతున్న పోలీసులు

కాశినాయన నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సావిశెట్టిపల్లెలో వారం రోజుల క్రితం ఓ ట్రాక్టర్ చోరీకి గురైంది. ఈ కేసులోని నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ముడమాల సుదర్శన్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్, ట్రిల్లర్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేసి పోట్లదుర్తి గ్రామానికి చెందిన పులి పెద్ద గంగరాజు కుమారుడు అంజన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. అతను ట్రాక్టర్, ట్రిల్లర్ చోరీ చేసినట్లు అంగీకరించడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రైల్వేగేటును ఢీకొన్న పాల వ్యాన్

● కమలాపురంలో గంటపాటు ట్రాఫిక్ జామ్



గేటు దెబ్బతినడంతో నిలిచిపోయిన వాహనాలు

కమలాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైల్వేగేటును పాలవ్యాను ఢీకొనడంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించిన సంఘటన కమలాపురం పట్టణంలో చోటు చేసుకుంది. మంగళవారం సాయంత్రం రైల్వే గేటు దాటుతున్న సందర్భంలో పాల వ్యాను ప్రమాదవశాత్తు గేటును ఢీకొంది. దీంతో రైల్వేగేటుకు డ్యామేజీ అయ్యింది. ఈ సమాచారం తెలుసుకున్న రైల్వే సిబ్బంది రైల్వే గేటును రిపేరు చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే రిపేరుకు ఎక్కువ సమయం పట్టడం, స్కూలు వదలే సమయం కావ డంతో విద్యార్థులు, ప్రయాణికుల రద్దీతో ట్రాఫిక్ స్తంభించి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటపాటు గేటు వద్దనే నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా ఇటీవల కురిసిన వర్షానికి అండర్ బ్రిడ్జిలో నీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ద్విచక్రవాహనదారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెల కొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మళ్లీ కేబుల్ చోరీ

● వరుస సంఘటనలతో ఆందోళనలో రైతులు

లింగాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారి చింతల, దిగువపల్లె గ్రామ పొలాల్లో బోరుబావులకు రైతులు ఏర్పాటు చేసుకున్న కేబుల్ వైర్‌లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఇప్పటికే అరటి ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా దొంగలు వరుసగా కేబల్ వైర్లను చోరీ చేస్తుండడతో రైతులు ఆందోళనలకు గురవుతున్నారు. సోమవారం రాత్రి సుమారు 40 మంది రైతులకు సంబంధించిన కేబుల్ వైర్‌లను దొంగతనం చేశారు. దీని విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని రైతులు చెబుతున్నారు. దొంగలు కేబుల్ వైర్‌ను కాల్చి గుజిరీకి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని, మళ్లీ కొత్తగా కేబబుల్ వైర్ కొనాలంటే ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తోందన్నారు. దొంగతనాలు వరుసగా జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని రైతులు వాపోతున్నారు. పోలీసులు కేబుల్ దొంగలను పట్టుకొని దొంగతనాలు జరగకుండా చూడాలని వారు పేర్కొన్నారు.

హత్య కేసులో 9 మంది అరెస్టు

కడప క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పెద్దదర్గా సమీపంలో శనివారం అర్ధరాత్రి అబూబకర్ అనే యువకుడిని హత్య చేసిన కేసుకు సంబంధించి 9 మందిని నకాశ్ సమీపంలోని కేసీ కాల్వ వద్ద మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ గంటా సుబ్బారావు తెలిపారు. సీఐ వివరాల మేరకు... కడప కుమ్మరి కుంటకు చెందిన అబుజార్, అలియస్ అబుషేక్ మహ్మద్ యూసఫ్ మధ్య మనస్పర్థలు ఉండేవి. శనివారం ఒంటరిగా ఉన్న అబూబకర్‌ను కత్తితో పొడిచి హత్య చేసినట్లు తెలిపారు. ఈకేసుకు సంబంధించి నిందితులైన అబూబజార్ అలియాస్ యూసుఫ్, గౌస్‌నగర్‌కు చెందిన అజంబాషా, ఆసిఫ్, లతీఫ్‌లతో పాటు మరో నలుగురు మైనర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కత్తి, ఓ సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఐదుగురిని రిమాండుకు, మైనర్లను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

కమలాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చదిపిరాళ్ల పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న పెంచలయ్యకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ఎంపీడీవో గౌస్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొని, ఫొటోలను వాట్సప్ గ్రూపులో పంపించాల్సి ఉంది. అయితే చదిపిరాళ్ల పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య పాత ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీ కార్యదర్శికి మెమో ఇచ్చి వివరణ కోరారు. ఈ మేరకు పెంచలయ్యకు షోకాజ్ నోటీసులు ఇచ్చి, మూడురోజుల్లో వివరణ ఇవ్వాల్సిందిగా కోరామని ఆయన తెలిపారు.

ప్రతి కుటుంబంలో పారిశ్రామికవేత్త... ప్రభుత్వ లక్ష్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

మైదుకూరు నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. మంగళవారం నంద్యాలంపేటలో 42 ఎకరాలలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కు శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డ్వామా పీడీ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తోందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తోందని తెలిపారు. బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ఏరియాలో పరిశ్రమలను ఏర్పాటు చేసుకున్న నిరుద్యోగ యువతకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడమేకాకుండా మౌలిక వసతులను ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి,రాష్ట్ర కనీసవేతనాల సలహామండలి డైరెక్టర్ దాసరిబాబు మాట్లాడుతూ ప్రభు త్వ రాయితీతో పాటు, బ్యాంకుల ద్వారా రుణాలు పొందే అవకాశం ఉన్నందున మహిళా సంఘాలు, నిరుద్యోగులు పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు రాజసింహ నరేంద్ర, సొసైటీ చైర్మన్ మారుతీ, బీఎన్ శ్రీను, ఆర్.శ్రీనివాసులు, ధనపాల రవి, మెప్మా అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మిల్లెట్స్ ఆహార ఉత్పత్తుల వ్యాపారవేత్త ప్రమీలకు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న బీటెక్ రవి

పులివెందుల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవకాశాలు కల్పిస్తున్నారని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ ఇస్టా ఆడిటోరియంలో పరిశ్రమలు- ఉపాధి కల్పన అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీటెక్ రవి మాట్లాడుతూ ఎవరిమీద ఆధార పడకుండా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. పులివెందులలో ఏపీఐఐసీ భూములు ఉన్నాయి, ఇక్కడ పరిశ్రమలు స్థాపిం చుకునేందుకు అవకాశం ఉందన్నారు. పరిశ్రమలు పెట్టి పది మందికి ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. అనంతరం డ్వాక్రా రుణాలతో పరిశ్రమలు స్థాపించిన ప్రమీల, వెంగమ్మలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, మార్కెట్ యార్డు మాజీచైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పులివెందుల వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి, సంయు గ్లాస్ ఫ్యాక్టరీ, ఆదిత్య బిర్లా ఫ్యాక్టరీ ప్రతినిధు లు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు



విజేతలతో అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఏపీ స్టేట్ లెవల్ మినీ (అండర్-11 బాల, బాలికల) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 250 మందికి పైగా క్రీడాకారులు హాజరు కాగా, క్వాలిఫై రౌండ్స్ ముగిసిన వారిని మెయిన్ డ్రాకు ఎంపిక చేశారు. తదుపరి ఈ నెల 9 నుంచి లీగ్ మ్యాచ్ నిర్వహించి 10న ప్రీ క్వార్టర్స్, క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు చేట్టారు. చివరి రోజు అయిన మంగళవారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్ నిర్వహించి విజేతలను ప్రకటించారు.

రాష్ట్రస్థాయి మినీ అండర్ 11 బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల బాలుర విభాగంలో సింగిల్ ఫైనల్ విజేతగా కార్తీక్ (అనంతపురం) నిలచారు. బాలికల సింగిల్ విభాగంలో సీతఈ ప్రియాంక్ (వైజాగ్) విజేతగా నిలిచారు. బాలుర డబుల్స్ విభాగంలో ఫైనల్ విజేతగా ఎం.దేవాన్ష్ రుషి, ఎస్‌షాహిర్ (చిత్తూరు) విజేతలుగా నిలిచారు. అలాగే బాలికల డబుల్స్ విభాగంలో కె.శ్రీఆద్యా రెడ్డి (వెస్ట్ గోదావరి), మధులిక (చిత్తూరు) విజేతలుగా నిలిచారు. విజేతలకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.భాస్కర్‌రెడ్డి హాజరై బహుమతులు అందించారు. డీఎస్‌డీవో గౌస్‌బాషా, అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజుతో పాటు పలువురు కోచ్‌లు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుల శిక్షణ పూర్తి చేసుకున్న కడప స్కౌట్ విద్యార్థి



కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 7వ జాతీయ విపత్తుల శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో అక్టోబరు 15 నుంచి నిర్వహించిన 22రోజుల ప్రత్యేక శిక్షణ శిబి రంలో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన స్కౌట్ విద్యార్థి పి.వెంక టరమణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఏకైక అభ్యర్థిగా ప్రాతినిధ్యం వహించారు. కడప నగరం శ్రీహరి డిగ్రీ కళాశా లలో చదువుకునే సమయంలో స్కౌట్ తరపున గతంలో ఈయన పాల్గొన్నారు. కాగా యువ ఆపద మిత్ర శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు ఏపీ నుంచి వెంకటరమణ ఒక్కరికే అవకాశం లభించడం విశేషం. ఈ సంద ర్భంగా జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు వెంకటరమణకు అభినందనలు తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుతో తంబళ్లపల్లె అభివృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

తంబళ్లపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కుక్కరాజుపల్లె సచివాలయం వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రూ.7.70 కోట్లతో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అధికారులు, స్థానికులు వీడియో ద్వారా శంకుస్థాపన కార్యక్రమాన్ని వీక్షించారు. మదనపల్లె ఏపీఐఐసీ ఐపీఓ శంకర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుతో నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి నాగార్జున, జిల్లా ఉపాధి కల్పనాధికారి దోనప్ప మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. ఇప్పటికే స్కిల్ హబ్ ద్వారా పలువురు నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజరు ఆంజనేయులు, సర్పంచ్ రామరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, మదన్‌మోహన్, శేఖర్‌రెడ్డి, ఆదిరెడ్డి, ఏపీఎం గంగాధర్, రెవెన్యూ, వెలుగు సిబ్బంది, కూటమి నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం అబుల్‌కలాం ఆజాద్



ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ

కడప క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేటి తరం యువత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య పేర్కొన్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ మాట్లాడుతూ మౌలానా ఆజాద్ జయంతిని దేశంలో జాతీయ విద్యా దినోత్సవంగా చేసుకుంటారన్నారు. ఆయన ప్రఖ్యాత పండితుడని, అరబిక్, ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలి అనేక భాషల్లో ప్రావీణ్యులన్నారు. స్వాతంత్ర్య సమరఘట్టంలో ముఖ్య నాయకులన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు శివరాముడు, శ్రీశైలరెడ్డి, సోమశేఖర్ నాయక్, డీపీవో ఏవో వెంకటరమణ, ఆర్ఎస్ఐలు వెంక టేశ్వర్లు, స్వామినాయక్, అప్పలనాయుడు, డీపీవో, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే పంచాయతీల అభివృద్ధి

చెన్నూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో శుభ్రతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కాళహస్తి సీనియర్ ఫ్యాకల్టీ సరళ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో జిల్లాస్థాయిలో అన్ని మండలాల ఎంపీ డీఓలకు రెండో రోజు శిక్షణలో సీనియర్ ఫ్యాకల్టీ మాట్లాడుతూ సుస్థిరత అభివృద్ధికి, మంచి ఆదాయ వనరులకు పంచాయతీలు కీలకమన్నారు. సొంత ఆలోచనలతో స్థానికంగా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రతి మండలంలో అధికారులకు శిక్షణలు నిర్వహిస్తోందన్నారు. జడ్పీ సీఈఓ ఓబులమ్మ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి, పరిశుభ్రత ఎవరికి వారు విధి నిర్వహణలో నిక్కచ్చిగా పనిచేసినప్పుడే సాధ్యమ వుతుం దన్నారు. తద్వారా ఆ పంచాయతీలు రాబోయే కాలంలో మంచి అభివృద్ధితో ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. డీపీఓ రాజ్యలక్ష్మి, డీడీఓ మైథిలి, డీఎల్‌డీఓ శేషయ్య, డీఎల్‌పీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ కిరణ్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఎస్పీ



వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

వేంపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రమేయం ఉన్నట్లు తెలిసినా వారిపై చట్టపర చర్యలు తప్పవని ఎస్పీ నచికేత్ విశ్వ నాథ్ హెచ్చరించారు. వేంపల్లె పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. స్థానిక పోలీసులు, అధికారులతో శాంతిభద్రతలపై ఆరా తీశారు. ఫ్యాక్షన్ గ్రామాల పరిస్థితుల గురించి వాకబు చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్క రించేలా పోలీసులు చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో నిద్రించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, బెట్టింగ్ తదితరవి ఎక్కడ జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. పోలీ సులకు ప్రమేయం ఉన్నట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని, రాత్రి వేళల్లో నైట్‌బీట్‌లు పకడ్బందీగా ఉండాలని, నేరాలు జరగకుండా ముందు జాగ్రత్తగా పోలీసుల పనితీరు ఉండాలన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజల పట్ల పోలీసులు మర్యాదగా ప్రవర్తించాలని, సమ స్యలను విని ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మెరుగుపరచాలన్నారు.

నిందితుల పీటీ వారెంట్‌కు కోర్టు అనుమతి

● మదనపల్లె సబ్‌జైలు నుంచి విజయవాడకు తరలింపు ● ఇబ్రహీంపట్నం కేసులోనూ ఈ నలుగురూ నిందితులే



నిందితులను విజయవాడ కోర్టుకు తీసుకెళ్తున్న ఎక్సైజ్ పోలీసులు

ములకలచెరువు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అరెస్టయి మదనపల్లె సబ్ జైలులో ఉన్న నలుగురు నిందితులను మంగళవారం ఎక్సైజ్ పోలీసులు విజయవాడ కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకెళ్లారు. ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీ గుట్టును గత నెల 3వ తేదీ ఎక్సైజ్ ఉన్నతాధికారులు రట్టు చేశారు. ములకలచెరువు కేసులో ఇప్పటి వరకు 21 మందిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. ఇబ్రహీంపట్నంలోని నకిలీ మద్యం తయారీ కేంద్రంపై అక్కడి పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. ఇందులో ప్రధాన నిందితుడు అద్దేపల్లె జనార్దన్‌రావు అనుచరుడు, ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన కట్టా రాజు(ఏ2), ఇబ్రహీంపట్నంకు చెందిన సయ్యద్‌హాజీ(ఏ3), ఒరిస్సా రాష్ట్రంకు చెందిన మిధున్‌దాస్(ఏ10), అంతాదాస్ (ఏ11) తదితరులపై ఇబ్రహీంపట్నంలోనూ కేసు నమోదైంది. దీంతో మదనపల్లె సబ్‌జైలులో ఉన్న నలుగురు నిందితులను ఇబ్రహీంపట్నం కేసులోనూ అరెస్టు చూపేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఇటీవల పీటీ వారెంట్ దాఖలు చేశారు. విచారణ జరిపిన కోర్టు ఈనెల 12వ తేదీలోగా నలుగురు నిందితులను పీటీ వారెంట్‌పై హాజరు పరిచేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో నిందితులను విజయవాడకు తీసుకెళ్లారు. బుధవారం నిందితులను విజయవాడ కోర్టులో హాజరు పరచనున్నారు.

కృత్రిమ మేధస్సు మంచిదే...

మానవతా విలువలు ముఖ్యం : వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సు యుగంలో మానవతా విలువలు, సృజనాత్మకత, నైతిక స్పృహను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని వైవీయూ సర్ సీవీ రామన్ సైన్స్ భవనంలో వీసీ అధ్యక్షతన అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో కర్నూలు డాక్టర్ అబుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వై.నరసింహులు కీలక ఉపన్యాసం చేస్తూ డిజిటల్ లెర్నింగ్ వాతావరణంలో మానవత్వం ప్రాముఖ్యతను వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పీఎం ఉష సమన్వయకర్త డాక్టర్ టి.చంద్రశేఖర్ సమన్వయం చేశారు. ఉర్దూ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రియాజున్నీసా ఆధ్వర్యంలో పీఎం ఉష, మైనారిటీ సెల్, ఉర్దూ విభాగం సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించగా పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులమని.... భయపెడుతున్నారు

● నిజాన్ని దాచి తారుమారు చేయాలని చూస్తున్నారు

● పీటీఎం ఎస్‌ఐ కారు ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోండి

● సీఎంఓ కార్యదర్శి, హోం మంత్రి, ఎస్పీలకు ఫిర్యాదు

ములకలచెరువు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలీసులమని... భయపెడుతూ... ప్రమాదం చేసిన పెద్దతిప్పసముద్రం ఎస్‌ఐ కారును మార్చిన ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రోడ్డు ప్రమాద బాధితుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుల్తాన్ తండ్రి దస్తగిరి ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శులు ప్రద్యుమ్న, రవిచంద్ర, కార్తికేయ మిశ్ర, హోం మంత్రి అనిత, ఎస్పీ ధీరజ్ కునుబిల్లికి ఫిర్యాదు చేశారు. మంగళవారం మెయిల్, ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు పత్రాలను పంపారు. తాను వికలాంగుడినని తన ఒక్కగానొక్క కుమారుడు సుల్తాన్‌ను ములకలచెరువు మండలం పెద్దపాళ్యం ఫ్లైఓవర్‌పై పెద్దతిప్పసముద్రం ఎస్‌ఐ హరిహర ప్రసాద్ కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు ములకలచెరువు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వస్తే పోలీసులు భయపెట్టి నోటికొచ్చినట్లు మాట్లాడి అవమానించారని వాపోయాడు. ఎస్‌ఐ వాహనాన్ని దాచి నిందితులను రక్షించాలని చూస్తున్నాడని, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

కారు మాయంపై సర్వత్రా చర్చ

ప్రమాదానికి కారణమైన పెద్దతిప్పసముద్రం ఎస్‌ఐ హరిహర ప్రసాద్ కారు మాయమవడంపై చర్చ జోరుగా సాగుతోంది. ముంబై-చెన్నై జాతీయ రహదారిలో ఈనెల 7వ తేదీ పీటీఎం ఎస్‌ఐ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొని శ్రీసత్యసాయి జిల్లా మహమ్మదాబాద్‌కు చెందిన సుల్తాన్ తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమించిన విషయం విదితమే. ప్రమాదం జరిగిన వెంటనే ఎస్‌ఐ కారు నెంబర్ ప్లేట్లను తొలగించి ములకలచెరువులోని ఓ కల్యాణ మండపంలో దాచారు. అయితే ఇక్కడ దాచిన కారు సైతం మాయమైంది.

బాధితుడి పట్ల నిర్లక్ష్యం

పీటీఎం ఎస్‌ఐ హరిహర ప్రసాద్ కారు ఘటనలో గాయపడిన సుల్తాన్ పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా ఇప్పటి వరకు మూడు ఆపరేషన్లు చేశారు. అయినా బాధితుడు కోలుకోవడం కష్టంగా మారింది. కుటుంబానికి దిక్కుగా మారిన ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదానికి గురవడంతో చికిత్స చేయించే దిక్కు కూడా లేకుండా పోయింది. మానవత్వంతోనైనా వ్యవహరించి బాధితుడిని పరామర్శించాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

అవిశ్వాస తీర్మానం వాయిదా

బి.కొత్తకోట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానం ఓటింగ్ 14వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌షకూర్ మంగళవారం ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంపీటీసీ సభ్యులందరినీ వాళ్లకు చెందిన వారికే ఎంపిక చేసుకున్నారు. వారిలో గుమ్మసముద్రం ఎంపీటీసీ లక్ష్మీనరసమ్మను ఎంపీపీగా ఎన్నుకున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఎంపీపీపై విశ్వాసం లేదని, ఆమెను పదవీచ్యుతురాలిని చేయాలని సభ్యులందరూ తీర్మానించుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ విషయమై ఈ నెల12న బి.కొత్త కోట మండల పరిషత్ కార్యాలయంలో ఓటింగ్ చేపడతామని మదనపల్లి సబ్‌కలెక్టర్ కళ్యాణి ప్రకటిస్తూ అందరూ హాజరు కావాలని ఎంపీటీసీ సభ్యులందరికీ నోటీసులు జారీ చేశారు. అధికారులు సైతం అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే బుధవారం జిల్లాలోని చిన్నమండ్యం మండలంలో సీఎం చంద్రబాబు పర్యటన ఉన్న నేపథ్యంలో మదనపల్లి సబ్‌కలెక్టర్ విధినిర్వహణలో భాగంగా చిన్నమండ్యం వెళ్లాల్సి ఉన్నందున బి.కొత్తకోట మండల ఎంపీపీ అవిశ్వాస తీర్మానం ఓటింగ్ కార్యక్రమం ఈ నెల 14కు వాయిదా వేసినట్లు బి.కొత్తకోట ఎంపీడీఓ ప్రకటించారు.

నేడు రేపు ఆదర్శపాఠశాలలో విగ్రహ ప్రతిష్ఠ

పెద్దతిప్పసముద్రం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో నేడు, రేపు పాఠశాల ఆవరణలో కొత్తగా నిర్మించిన గణపతి, సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆధ్యాత్మికతను, సంస్కారం, సానుకూలతను పెంపొందించేందుకు పాఠశాల ఆవరణలో ఈవిగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిని పాఠశాల ప్రధాన గేటు సమీపంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమాలను మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల కమిటీ చైర్మన్‌లు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



పడి పూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

తంబళ్లపల్లె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదంవడ్డిపల్లెలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు 18 మెట్లను ప్రత్యేకంగా అలంకరించి గణపతి, కుమార స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప స్వామిని స్మరిస్తూ భజనలు, పాటలు పాడారు. అయ్యప్ప నామస్మరణతో గ్రామమంతా మార్మోగింది. పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గురుస్వాములు రెడ్డిమల్లు, రామ్మూర్తి, రాజు, భానుప్రకాష్, జగదీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

15,16న గురువులకు క్రీడాపోటీలు

మదనపల్లె అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో 15,16న గురువులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రాజగోపాల్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్, పోటీలు ఉంటాయన్నారు. 15,16న మండల స్థాయి పోటీలు, 22,23న డివిజన్ స్థాయి పోటీలు, 28,29న జిల్లా స్థాయి, డిసెంబరు 13 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయులకు ఈ పోటీల్లో అవకాశం కల్పించారన్నారు. ఉపాధ్యాయులు క్రికెట్ పోటీల విషయమై జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజును, ఉపాధ్యాయినులు త్రోబాల్ విషయమై మహిళా స్కూల్ గేమ్స్ అడ్మిన్ ఝాన్సీరాణిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, వ్యాయామ సంఘం అధ్యక్షుడు నరేష్‌బాబు, డివిజన్, మండల వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్, భద్రయ్య, తాజ్‌బాషా, మహేంద్ర, జోహర్‌గౌడ్, అన్సర్, లత, అంజనప్ప, పాల్గొన్నారు.

ఓర్వలేకే తప్పుడు ఫిర్యాదులు

● డీఏఓకు కోళ్లబైలు ప్రజల వినతి



సబ్‌కలెక్టరేట్ డీఏఓకు వినతి పత్రం ఇస్తున్న కోళ్లబైలు టీడీపీ నేతలు

మదనపల్లె టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కోళ్లబైలు-2 పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకే కొందరు వైసీపీ నేతలు, సంఘ విద్రోహులు అధికారులపై తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్నారని కోళ్లబైలు టీడీపీ ఇన్‌చార్జి రాటకొంట శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. మంగళవారం సబ్‌కలెక్టరేట్‌లో డీఏఓ నిర్మలాదేవికి ప్రజలతో కలిసి వినతి పత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాష ఆధ్వర్యంలో కోళ్లబైలు-2లో రూ.4.5 కోట్లతో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణాలు చేపట్టామని, పారిశుధ్య పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. ఇది చూసి ఓర్వలేక వైసీపీ నేతలు పంచాయతీ కార్యదర్శిపై సబ్‌కలెక్టర్‌కు తప్పుడు ఫిర్యాదు ఇచ్చారన్నారు. వైసీపీ నేతలు అవినీతి, అక్రమాలకు సహకరించలేదనే పంచాయతీ కార్యదర్శి మంజులపై అభియోగాలు మోపారన్నారు. అధికారుల విచారణలో వాస్తవాలు తెలుతాయన్నారు. అవినీతికి పాల్పడుతున్న సర్పంచ్‌లు, వీరి వెనుక వున్న సంఘ విద్రోహశక్తులపై విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో కోళ్లబైలు-2 టీడీపీ నేతలు బి.శేఖర్, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనాథ్, మధు, రమేష్, శంకర, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడికి ఘనసన్మానం



టీడీపీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న కంభం నిరంజన్‌రెడ్డి, నేతలు

వాల్మీకిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండల పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన దామోదర్‌రెడ్డిని మంగళవారం నేతలు సన్మానించి సత్కరించారు. ప్రమాణం అనంతరం పార్టీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, మండలంలోని నాయకులు, కార్యకర్తలందరితో పార్టీ పటిష్ఠతకు చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీలేరు టీడీపీ సీనియర్ నేత కంభం నిరంజన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కోనూరి చంద్రమౌళి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నేతలు గాంధీపేట రమణ, రాజేంద్రాచారి, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ బాషా, రామాంజులురెడ్డి, గుర్రెడ్డి చంద్రారెడ్డి, రమణ, సైదు, సురేష్‌రెడ్డి, మదనమోహన్‌రెడ్డి, రెడ్డిరామ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులు మూత

కర్ణాటక సరిహద్దుల్లో కొరవడిన నిఘా ● అక్రమార్కులకు రాచమార్గాలు

చేతులెత్తేసిన పోలీసులు ● రాత్రిళ్లు సరిహద్దులు దాటుతున్న ఇసుక





తాళం వేసిన మారుగానిపల్లె చెక్ పోస్టు - బార్లా తెరుచుకున్న చేలూరు చెన్నరాయునిపల్లె క్రాస్ చెక్‌పోస్టు

పెద్దతిప్పసముద్రం నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులు మూతపడడంతో అక్రమార్కులకు రాచమార్గాలుగా మారాయి. పోలీసుల నిఘా కొరవడడంతో కర్ణాటక రాష్ట్రానికి అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. మండలం నుంచి కర్ణాటక రాష్ట్ర సరిహద్దుగా ఉన్న టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె సమీపంలో పాపాఘ్ని నది ఉండడంతో ఇక్కడ యధేచ్ఛగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులను మూసేయడంతో అక్రమార్కులకు వరంగా మారింది. ఇవేకాక కర్ణాటక రాష్ట్రం నుంచి పెట్రోల్, డీజల్‌ను ఎక్కువగా తరలిస్తున్నారు. మన రాష్ట్రంలో కంటే సుమారు పదిరూపాయలు తక్కువగా ఉండడంతో వాహనదారులు కర్ణాటక రాష్ట్రానికి వచ్చి పెద్ద పెద్ద క్యాన్ల ద్వారా పెట్రోల్, డీజల్ తీసుకొస్తున్నారు. దీంతో రాష్ట్ర ఖాజనాకు భారీగా గండిపడుతోంది.

తరలుతున్న ఎర్రచందనం, గంజాయి

రాత్రిళ్లు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుల ద్వారా వివిధ రకాల సరుకులు అక్రమంగా తరలిపోతున్నాయి. చెక్‌పోస్టులు ఎత్తివేయడంతో రాత్రిళ్లు అనంతపురం, కడప జిల్లాల నుంచి కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుల మీదుగా అక్రమార్కులు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలో నాలుగు చెక్‌పోస్టులున్నాయి. కందుకూరు రోడ్డులో సరిహద్దు మారుగానిపల్లె, టి.సదుం చెన్నరాయునిపల్లె క్రాస్, అంకాలమడుగు క్రాస్, మల్లెల సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మొత్తం నాలుగు చెక్‌పోస్టులున్నాయి. ఈచెక్ పోస్టులు దాటితే కర్ణాటక రాష్ట్రంలోకి చేరుకుంటారు. చెక్‌పోస్టులు పూర్తిగా మూసేయడంతో అక్రమార్కులకు రాచమార్గాలుగా తయారయ్యాయి. దీంతో తక్కువ సమయంలోనే యధేచ్ఛగా పలురకాల సామగ్రిని సరిహద్దు దాటిస్తున్నారు. గతంలో చెక్‌పోస్టుల్లో గట్టి నిఘాఉండడంతో అక్రమార్కులకు కొంచెం భయం ఉండేది. ఇప్పుడు చెక్‌పోస్టుల్లో భద్రత లేకపోవడంతో ఎప్పుడు పడితే అప్పుడు యధేచ్ఛగా సరుకును రవాణా చేసుకునే వెసులుబాటు ఉండడంతో సరిహద్దు రాష్ట్రాల్లో విచ్చలవిడిగా అక్రమంగా తరలిపోతోంది. కనీసం ఇప్పటికైనా సరిహద్దు చెక్‌పోస్టుల్లో సిబ్బందిని నియమించి నిఘాపెట్టి అక్రమార్కులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి

ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిపిద్దాం ● గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేద్దాం

టీడీపీ మండల అధ్యక్షుల ప్రమాణస్వీకారోత్సవ సభలో ఎమ్మెల్యే నల్లారి స్పష్టీకరణ



ప్రమాణ స్వీకారం చేస్తున్న మండల టీడీపీ అధ్యక్షులు

కలికిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ఏర్పాటవతూనే పీలే రులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తి చేసుకుని కొత్తగా మండల టీడీపీ అధ్యక్షులసహా వివిధ విభాగాల నేతల ప్రమాణోత్సవ సభ అనంతరం పరిచయ కార్యక్రమం మంగళవారం నగరిపల్లెలో జరిగింది. ఆరు మండలాల టీడీపీ అధ్యక్షులు ప్రమాణం అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరుగుతాయని టీడీపీ శ్రేణులు ఇప్పటి నుంచే ఆ దిశగా ప్రజల్లో బలం పెంచుకోవాలన్నారు. సర్పంచ్, ఎంటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ నేతలు(వైసీపీ) సాగించిన దౌర్జన్యాలు తెలిసినవేనని, పాశవిక దమనకాండతో 90 శాతం పైబడి స్థానాలను గెలుచుకున్న వారికి తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ప్రజల్లో బలం పెంచుకునేందుకు ఇప్పటి నుంచే నేతలు కృషి చేయాలని కోరారు. అప్పటి అధికార పార్టీ నాయకుల వైఖరి కారణంగా అన్నమయ్య జిల్లాలో కలవాల్సి వచ్చిందని, అయితే చంద్రబాబు, నారా లోకేష్ మదనపల్లె జిల్లా ఏర్పాటుకు ఇచ్చిన హామీని నెరవేర్చడం తథ్యమన్నారు. ఇవి రెండూ పూర్తయితే పీలేరును మున్సిపాలిటీగా చేయనున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలోని పీలేరు, కలకడ, గుర్రంకొండ, కేవీ పల్లె మండలాలకు ముందున్న వారినే టీడీపీ అధ్యక్షులుగా కొనసాగించారు. వాల్మీకిపురం మండలానికి అయ్య వారిపల్లె మాజీ సర్పంచ్ దామోదర్ రెడ్డిని, కలికిరి మండలానికి పల్లవోలు మాజీ సర్పంచ్ షాబుద్దీన్‌ను నియమించారు. ఇతర విభాగాలకు దాదాపు అందరినీ కొనసాగించారు. మొత్తం కొత్త టీమ్‌ను కిశోర్‌కుమార్ రెడ్డి సన్మానించి అభినందించారు. సింగిల్ విండో అధ్యక్షుడు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, కలికిరి మాజీ సర్పంచు లక్ష్మీకర్ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ మాలతి, మాజీ చైర్మన్ నిరంజన్ రెడ్డి, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, విలేజ్, బూత్ కమిటీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన ఎంపీ

పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ ముఖ్య నేతలు

మదనపల్లె టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెను జిల్లా కానివ్వకుండా మోసగించిన ఎంపీ మిధున్‌రెడ్డి, ఇప్పుడు మదనపల్లెలో నిరసన ర్యాలీ చేపట్టేందుకు వస్తుండడం సిగ్గుచేటని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ మండిపడ్డారు. మంగళవారం స్థానిక బెంగళూరు బస్‌స్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో టీడీపీ ముఖ్య నేతలు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు సార్లు రాజంపేట ఎంపీగా ఎన్నికైన మిధున్‌రెడ్డి మదనపల్లె అభివృద్ధికి ఎంపీలాడ్స్ కింద ఎంత నిధులు కేటాయించారో ప్రకటించాలన్నారు. మదనపల్లె మీదుగా వెళ్లనున్న కడప-బెంగళూరు రైలు మార్గాన్ని పులివెందుల మీదుగా జగన్ మళ్లించుకున్నా ప్రశ్నించలేదన్నారు. బీటీ కళాశాలను ప్రభుత్వ పరం చేశామని చెప్పుకుంటున్న వైసీపీ నేతలు బీటీ కళాశాలను గాల్లో దీపంలో వేలాడదీసే పరిస్థితికి తెచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మదనపల్లెకు మంజూరైన మెడికల్ కాలేజీని రెండేళ్లయినా పూర్తిచేయలేని వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు పీపీపీ విధానంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను నిర్మించి, నిర్వహించనుంటే వైసీపీ నేతలు నిరసన ర్యాలీ అంటూ డ్రామాలు ఆడుతున్నారన్నారు. మదనపల్లె అభివృద్ధికి సహకరించని ఎంపీ మిధున్‌రెడ్డి నైతిక బాధ్యత వహించి ఆయన పదవికి రాజీనామా చేయాలన్నారు. నాగూర్‌వలి మాట్లాడుతూ అవాస్తవాలను ప్రచారం చేసేందుకు వైసీపీ నేతలు మదనపల్లెలో ర్యాలీ చేసేందుకు సిద్ధమయ్యారని, ఐదేళ్ల వైసీపీ పాలనలో వారు చేసిన మోసాలన్నీ ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో రాటకొండ మధుబాబు, నవీన్‌చౌదరి, బాబాఫక్రుద్దీన్, జంగాల రమణ, రాటకొండ శ్రీనివాసులు, పాల్గొన్నారు.

ప్రమాదంలో మహిళకు గాయాలు



మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జయమ్మ

పెద్దతిప్పసముద్రం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొనడంతో జయమ్మ గాయపడింది. స్థానికులు, కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుమ్మరకుంట పంచాయతీ గజ్జలవారిపల్లెకు చెందిన రామసుబ్బారెడ్డి, జయమ్మ దంపతులు ఆలయానికి వెళ్లి తిరిగి గ్రామానికి వెళుతుండగా ఇదే గ్రామానికి చెందిన ఓ బాలుడు వీరి వాహనాన్ని వేగంగా ఢీకొనడంతో రామసుబ్బారెడ్డి దంపతులు రోడ్డుపై పడిపోయారు. దీంతో జయమ్మ కాలుకు తీవ్రగాయాలయ్యాయి.. కుటుంబ సభ్యులు, స్థానికులు గాయపడ్డ జయమ్మను హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ విద్యా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మైనార్టీ నేతలు

వాల్మీకిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భారతరత్న, భారతదేశ తొలి విద్యాశాఖామంత్రి అయిన మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలను మంగళవారం వాల్మీకిపురం జడ్పీ ఉర్దూ హైస్కూల్‌లో మైనార్టీ నేతల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణనాయక్, టీడీపీ మైనార్టీ నేతలు సయ్యద్ షబ్బీర్, కువైట్ సయ్యద్‌బాషా, సాదిక్, మొయిద్దీన్ అలీఖాన్, సయ్యద్‌శెట్టి, కువైట్ బాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెను జిల్లాగా ప్రకటించండి

సీఎంను కోరిన శ్రీరామ్‌చినబాబు



మదనపల్లె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలని, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. అమరావతిలోని సచివాలయంలో సీఎంను కలిసిన చినబాబు, డిసెంబరులోపు ప్రకటన చేయాలని, అందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గ రాజకీయాలను సీఎంకు వివరించారు. ఇటీవల ఇక్కడ జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో చినబాబు, సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి ఇక్కడి పరిస్థితులను వినతి పత్రం రూపంలో వివరించారు.

స్వామిత్వ సర్వేతో పంచాయతీల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు

నిమ్మనపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో చేపట్టిన స్వామిత్వ సర్వే ద్వారా పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం రాచవేటివారిపల్లి పంచాయతీలో స్వామిత్వ సభలు నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు మాట్లాడుతూ పంచాయతీలోని గ్రామాల స్కెచ్ నమూనా ప్రకారం ఇళ్లు, స్థలాలను సర్వే చేయించామన్నారు. అందులో ఎలాంటి అభ్యంతరాలు వున్నా సభ దృష్టికి తీసుకు వస్తే వాటిని 21రోజుల్లోగా పరిష్కారం చూపుతామన్నారు. ఈ సర్వే ద్వారా గ్రామాల్లో రోడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలను కల్పించేందుకు వీలు కలుగుతుందన్నారు. ముఖ్యంగా సర్వే చేసిన ఇళ్లకు ప్రభుత్వం ప్రాపర్టీ కార్డులను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మధు, కార్యదర్శి రజిని, వీఆర్‌ఓ హేమాంబరరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో కార్పెంటర్‌కు గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో కార్పెంటర్ జాఫర్ హేసేన్‌కు గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం సైదాపేటకు చెందిన కార్పెంటర్ జాఫర్ హేసేన్ వైఎస్సార్ కాలనీలో కార్పెంటర్ వర్క్ చేయడానికి బైక్‌పై వెళ్లి పని ముగించుకుని తిరిగి సైదాపేటకు వస్తుండగా మార్గమధ్యలో బైపాస్‌రోడ్డు, రాయల్ ఉడ్ వద్ద బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కార్పెంటర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. కార్పెంటర్ పరిస్థితి విషమంగా ఉందని వారు తెలిపారు.

పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా తన్వీర్

గుర్రంకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా ఖాజీ తన్వీర్‌ని నియమించినట్లు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో టీడీపీ కార్యక్రమాల్లో చురుకుగా పని చేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తన్వీర్ మాట్లాడుతూ పార్టీని పట్టణంలో బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఓబీసీల అభ్యున్నతికి కృషి చేయాలి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి మెమెంటో అందజేస్తున్న జబ్బల

మదనపల్లె అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని మంగళవారం సౌత్ ఇండియా ఓబీసీ అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెమొంటో అందించి పూలమాలతో సన్మానించినన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఓబీసీల అభ్యున్నతికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఓబీసీలను అన్ని విధాలా రాష్ట్రప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఒకే రోజు ఐదు ఇళ్లలో చోరీ

వాల్మీకిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చింతపర్తి గ్రామంలో గుర్తు తెలియని దుండగులు ఒకే రోజు ఐదు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఆర్‌ఎస్ రోడ్డులో సోమవారం వేకువజామున ఇంటి తాళాలు పగులగొట్టి రూ.25వేలు నగదు, ఐదు 12గ్రాముల ఉంగరాలు అపహరించుకుపోయారు. స్థానిక బీసీ కాలనీకి చెందిన టైలర్ మురాషా ఇంట్లో రూ.25వేలు నగదు, 20గ్రాముల బంగారు నల్లపూసల దండ, 200గ్రాముల వెండి పట్టీలు, ప్రసాద్ అనే వ్యక్తికి చెందిన ఇంట్లో 15గ్రాముల బంగారం, రూ.15వేలు నగదు అపహరించుకుపోతూ మరో రెండు ఇళ్లలో తాళాలు పగులగొట్టి బీరువాల్లో ఏమీ దొరక్కపోవడంతో దుండగులు ఉడాయించారు. ఈ చోరీల విషయమై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోరెడ్డిగారి పల్లెలో ప్రజా దర్బార్

చిన్నమండెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బోరెడ్డిగారిపల్లెలో మంగళవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు, అధికారుల నుంచి వినతి పత్రాలు స్వీకరించి ఆయా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రిని పలువురు అధికారులు, నాయకులు శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు.

ఉనికి కోసమే వైసీపీ ఉద్యమం

రాజంపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉనికి కాపాడుకునేందుకే ఉద్యమాల పేరుతో వైసీపీ విద్యార్థులు, యువతను రెచ్చగొడుతోందని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణు గోపాల్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణపేరుతో అసత్య ప్రచారానికి ప్రయత్నిస్తోందన్నారు.